విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లాల నుండి పెన్ సత్తా దినపత్రికలో పని చేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజక వర్గ ఇన్‌ఛార్జులు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

సెల్ : 98853 15759



RNI No.APTEL/2023/87729

ప్రశ్నించడం అందరి హక్కు...

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily





అనకాపల్లి సంపుటి : 3 సంచిక : 341 | 17 - 5 - 2025 శనివారం | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ పేజీలు : 8 వెల : 3.00


## ఇక పాక్ బ్రతుకు ప్రపంచం ముందు బట్టబయలు




**న్యూఢిల్లీ, మే 16 :** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్ సహా ఇప్పటికే అనేక తక్షణ చర్యలు చేపట్టిన భారత్ ఇప్పుడు కొత్త అడుగులు వేయబోతుంది. ప్రపంచం ముందు పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్ సహా ఇప్పటికే అనేక తక్షణ చర్యలు చేపట్టిది భారత్. ప్రపంచం ముందు పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని బట్టబయలు చేయబోతోంది. పహల్గాంలో 26 మంది ప్రాణాలు బలిగొన్న ఉదంతాన్ని, అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి ప్రపంచ దేశాలకు వివరించడానికి భారత ప్రభుత్వం అన్ని పార్టీల ఎంపీ ప్రతినిధుల బృందాన్ని విదేశాలకు పంపనుంది. కశ్మీర్‌పై పాకిస్తాన్ దురాగతాన్ని తిప్పికొట్టడానికి, పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదాన్ని బహిర్గతం చేయడానికి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించారు. ఇందు కోసం ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వివిధ రాజకీయ పార్టీల పార్లమెంటు సభ్యుల (ఎంపీలు) ప్రతినిధులను కీలకమైన ప్రపంచ రాజధానులకు పంపడానికి సన్నాహాలు చేస్తోంది. ఉగ్రవాద దాడులపై భారతదేశ దృక్పథాన్ని ప్రదర్శించడం, నిరంతర సీమాంతర ఉగ్రవాద బాధితురాలిగా భారతదేశం ఎదుర్కొంటున్న సవాళ్లని ప్రపంచానికి చాటి చెప్పడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ), ఇతర సంబంధిత ప్రభుత్వ విభాగాల సమన్వయంతో ఈ కార్యక్రమం చేపడతారు. దీంతో ఇప్పుడు సరిహద్దుల ఆవల నుంచి పుట్టు కొచ్చే ఉగ్రవాదం పై భారత్ తన వాణిని ప్రపంచ దేశాల ముందు బలంగా వినిపించబోతోంది. ఈ దౌత్య ప్రచారానికి మద్దతు ఇవ్వడానికి విదేశాలలో ఉన్న భారత మిషన్లు, పార్లమెంటరీ బృందాలతో కలిసి పనిచేస్తాయి. ఈ బృందంలో అధికార బీజేపీ ఎంపీలతో పాటు, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు ఉండే అవకాశం ఉంది. దీనికి సంబంధించి కేంద్రం త్వరలోనే అధికారిక ప్రకటన వెలువరించే అవకాశం ఉంది. భారత్ ఈ తరహా కార్యక్రమం చేపట్టడం ఇదే తొలిసారి.

## వాళ్లను అప్పగించండి నీళ్లు ఇస్తాం : జై శంకర్



**న్యూఢిల్లీ, మే 16 :** సింధూ జలాల నిలిపివేతపై భారత విదేశాంగ మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఆపే వరకు సింధూ నదీజలాల ఒప్పందం రద్దు కొనసాగుతుందని స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదులను భారత్‌కు అప్పగించాల్సిందేనని కుండబద్దలు కొట్టారు. భారత్– పాక్ మధ్య సమస్యల పరిష్కారానికి థర్డ్ పార్టీ జోక్యం అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. భారత విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ పాకిస్థాన్ విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఆపే వరకు సింధూ నదీజలాల ఒప్పందం రద్దు కొనసాగుతుందని తెలిపారు. భారత్– పాకిస్థాన్ దేశాల మధ్య మూడో పార్టీ జోక్యం అవసరం లేదని అన్నారు. కాల్పుల విరమణ ఎవరు కోరుకున్నారో అందరికి తెలిసిన విషయమే. భారత్ కేవలం పీఓకే, టెర్రరిజం గురించి మాత్రమే మాట్లాడుతోంది. సింధూ జలాల నిలిపివేత పై యథాతథ స్థితి కొనసాగుతుంది. ఉగ్రవాదాన్ని ఆపే వరకు సింధూ నదీ జలాల ఒప్పందం రద్దు కొనసాగుతూనే ఉంటుంది. పాకిస్థాన్ ఉగ్రవాదులను భారత్‌కు అప్పగించాల్సిందే. భారత్–పాకిస్థాన్ దేశాల మధ్య సమస్యల పరిష్కారానికి థర్డ్‌పార్టీ జోక్యం అవసరంలేదు. టెర్రరిస్టుల క్యాంప్‌లను మూసి వేయాల్సిందే అని విదేశాంగ మంత్రి జై శంకర్ స్పష్టం చేశారు. మరో వైపు భారత్–పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని కొనసాగించాలని ఇరు దేశాల ప్రతినిధులు నిర్ణయించారు. ఈ నెల 10 న డీజీఎంవోలు మధ్య కుదిరిన అవగాహనను అలాగే కొనసాగించాలని తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించే చర్యలు కొనసాగించాలని ఇరు దేశాల డీజీఎంవోలు నిర్ణయం తీసుకున్నారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సింధూర్‌ను మే 07న ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ అవగాహన మే 10న ప్రకటించాయి. తాజాగా ఇదే నిర్ణయాన్ని కొనసాగించాలని నిర్ణయించాయి.

## పర్యావరణ సమతుల్యత పాటిస్తూనే పారిశ్రామికాభివృద్ధి

### - ఎన్.ఆర్.ఐ. శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్




**విశాఖపట్నం, మే 16 (పెన్ సత్తా):** పర్యావరణ పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతూనే పారిశ్రామికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని, ఆ దిశగా అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతున్నామని, పర్యావరణ సమతుల్యత పాటిస్తున్నామని రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ, సెర్ప్, ఎన్.ఆర్.ఐ. శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విశాఖపట్టణం నో వాటెల్ హొటల్లో శుక్రవారం జరిగిన సస్టైనబిలిటీ సమ్మిట్ - 2025 లో ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్దేశాల మేరకు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర సాధనలో కీలకంగా వ్యవహరిస్తున్నామని, దానికి అనుగుణంగా ప్రతి మూడో శనివారం పరిసరాల పరిశుభ్రతను చేపడుతున్నామని వివరించారు. క్లీన్ అండ్ గ్రీన్ ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావానికి అడుగులు వేస్తున్నామని, వాతావరణ సమతుల్యతను పాటిస్తూ అభివృద్ధి ప్రాజెక్టులు చేపడుతున్నామని ఉద్ఘాటించారు. దానిలో భాగంగానే 4.0 ఎంఎస్ఎంఈ పాలసీని రూపొందించామని, ఒన్ ఫ్యామిలీ ఒన్ ఎంటర్‌ప్రెన్యూర్ కాన్సెప్ట్ కు ప్రాధాన్యత ఇస్తూ తగిన సహాయ, సహకారాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి నియోజక వర్గంలో గ్రీన్ ఫీల్డ్ ఎంఎస్ఎంఈ పార్కులను నెలకొల్పుతున్నామని మంత్రి గుర్తు చేశారు. సోలార్, పంప్డ్ ఎనర్జీ, బయో ఇంధన వనరులతో కూడిన 20 గిగా వాట్ల విద్యుత్ ఇంధన వనరుల ఉత్పత్తికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని, ప్రత్యేక ప్రాజెక్టుల రూపకల్పనతో కార్యసాధన వైపు అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. సర్క్యులర్ ఎకానమీ, సస్టైనబిలిటీ డెవలప్మెంట్, పర్యావరణ హిత తదితర ఉద్దేశాలకు ప్రాధాన్యత ఇస్తూ స్వర్ణాంధ్ర ఏ 2047 సాధనకు అవిరళ కృషి చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ఉద్ఘాటించారు. అనంతరం విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ విశాఖపట్టణం ఎన్నో విశిష్టతలు కలిగి ఉన్న నగరమని, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వృద్ధికి ఇదొక చోదక శక్తి అని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అభివర్ణించారు. రాష్ట్రంలోనే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థలో, జీడీపీ రేషియోలో కూడా విశాఖపట్టణం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. సువిశాలమైన తీరం, ఉత్పాదకత కలిగిన మావన వనరులు ఉన్నాయని గుర్తు చేశారు. పారిశ్రామిక అభివృద్ధికి, పాలసీలకు అనుగుణంగా జిల్లాలో చర్యలు చేపడుతున్నామని చెప్పారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నీటి సంరక్షణ చర్యలు చేపడుతున్నామని, ధాన్ ఫౌండేషన్ సహాయంతో ఇప్పటికే పలు పనులు చేశామని గుర్తు చేశారు. తీర ప్రాంత రక్షణకు, అర్బన్ ఫ్లడ్ మేనేజ్మెంటుకు తగిన చర్యలు చేపడుతున్నామని, సుమారు రూ.200 కోట్లతో వివిధ ప్రాజెక్టులు చేపడుతున్నట్లు వివరించారు. ఇప్పటికే ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ ను నెలకొల్పామని తెలిపారు. లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంటుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, గ్రీన్ విశాఖ మిషన్ లో భాగంగా మిలియన్ మొక్కలు నాటేందుకు కార్యాచరణ రూపొందించామని, గ్రీన్ కవరేజ్ 28 నుంచి 33 శాతానికి తీసుకెళ్తామని కలెక్టర్ పేర్కొన్నారు. పచ్చదనం పెంపులో పాఠశాల విద్యార్థులను భాగస్వామ్యం చేస్తామని, ప్రతి ఒక్కరి చేతా మొక్కలు నాటిస్తామని చెప్పారు. దీనిలో పోర్టు, హెచ్పీసీఎల్, ఇతర స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటున్నామని గుర్తు చేశారు. రానున్న మూడు నాలుగు సంవత్సరాల్లో అద్భుతమైన మార్పులు చోటు చేసుకుంటాయని అన్నారు. స్వర్ణాంధ్ర ఏ 2047 సాధనలో భాగంగా ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ పలు చర్యలు చేపడుతున్నామని, ప్రతి మూడో శనివారం ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో, పారిశ్రామిక ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో సీఐఐ ప్రతినిధులు గన్నమనేని మురళీ కఅష్ణ, ఎస్. నరేంద్ర కుమార్, డా.పి.రాంబాబు, థాకూర్ ఎస్. పెర్వానీ, నారాయణరాజు తదిరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు, పవన్, పురందేశ్వరిల భారీ తిరంగా ర్యాలీ









**విజయవాడ, మే 16 (పెన్ సత్తా):** దేశ రక్షకులకు మద్దతుగా, భారతమాత కీర్తి పతకాన్ని ప్రపంచానికి చాటుతూ తిరంగా ర్యాలీ చేపట్టామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. తీవ్రవాదం రూపంలో ఎవరూ దేశంలో అడుగుపెట్టినా వారికదే చివరిరోజు అని హెచ్చరించారు. జాతి పునర్నిర్మాణంలో అందరం భాగస్వాములు కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. విజయవాడలో శుక్రవారం భారీ తిరంగా ర్యాలీని కూటమి నేతలు నిర్వహించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజ్ సర్కిల్ వరకూ ఈ ర్యాలీ కొనసాగింది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద తిరంగా ర్యాలీ ని సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. విజయవాడలో భారత సైనికులకు మద్దతుగా శుక్రవారం నాడు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, కూటమి నేతలు, ప్రజలు భారీగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు, కార్యకర్తలు, విజయవాడ నగరవాసులు భారీగా పాల్గొన్నారు. జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీకి నగరవాసులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ లాంటి కార్యక్రమాలకు దేశం సిద్ధమని, ఇదే ప్రపంచంలోని ఉగ్రవాదులకు హెచ్చరిక కావాలని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా భారత రక్షణ దళాలకు సీఎం చంద్రబాబు సెల్యూట్ చేశారు. పహల్గామ్ ఘటనలో ఆడబిడ్డల కుంకుమ చెరిపేసిన వాళ్లు ఈ భూమ్మీద ఉండకూడదనే ప్రధాని నరేంద్ర మోదీ ఆపరేషన్ సిందూర్ చేపట్టారని ఆయన తెలిపారు. ఉగ్రవాదంపై పోరాడుతున్న ఏకైక నాయకుడు మోదీ అని ముఖ్యమంత్రి కొనియాడారు. త్రివర్ణ పతాక రూపశిల్పి ఈ ప్రాంతం వారేనని గుర్తు చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలు కోల్పోయిన మురళీ నాయక్‌కు నివాళులు అర్పించారు చంద్రబాబు. పాకిస్థాన్ కుట్రలు, కుతంత్రాలు భారతదేశాన్ని ఏం చేయలేవని ధీమా వ్యక్తం చేశారు. ఉగ్రవాదులు ప్రపంచంలో ఏ మూల దాక్కున్నా వారిని తుదముట్టించాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పమని చెప్పుకొచ్చారు. సరైన సమయంలో సరైన నిర్ణయాలను మోదీ తీసుకుంటారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ భారతదేశంలో పాకిస్థాన్ వల్ల ఎప్పుడు ప్రశాంతత చూడలేదని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. భారతదేశం అభివృద్ధి చెందుతుంటే పాకిస్థాన్ చూసి ఓర్వలేకపోతోందని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంత ప్రశాంతంగా ఉన్నామంటే బోర్డర్‌లో దేశాన్ని కాపాడుతున్న సైనికుల వల్లే అది సాధ్యమవుతోందని తెలిపారు. దేశం కోసం పోరాడిన మురళీ నాయక్ లాంటి సైనికులు దేశానికి నిజమైన నాయకులని పవన్ చెప్పుకొచ్చారు. చనిపోతే సైనికుడిగా దేశం కోసం పోరాడిన మురళీ నాయక్‌లాగా చనిపోవాలని అన్నారు. సెలబ్రిటీస్ నుంచి దేశభక్తి ఆశించవద్దని, సినిమా హీరోలంతా దేశాన్ని నడిపేవారు కాదని అన్నారు. వాళ్లంతా ఎంటర్‌టైన్ చేసేవాళ్లు మాత్రమేనని పేర్కొన్నారు. శాంతి వచనాలు ఇక పని చేయవని, పాకిస్థాన్ వాళ్లు భారత్ లోకి వచ్చి కొడితే వాళ్ల సరిహద్దు దాటి వారి ఇళ్లల్లోకి వెళ్లి మనం కొడతామని పవన్ కల్యాణ్ తీవ్రంగా హెచ్చరించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ భారతదేశంలో పాకిస్థాన్ వల్ల ఎప్పుడు ప్రశాంతత చూడలేదని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. భారతదేశం అభివృద్ధి చెందుతుంటే పాకిస్థాన్ చూసి ఓర్వలేకపోతోందని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంత ప్రశాంతంగా ఉన్నామంటే బోర్డర్ లో దేశాన్ని కాపాడుతున్న సైనికుల వల్లే అది సాధ్యమవుతోందని తెలిపారు.

భారతదేశ ఐక్యమత్యాన్ని చాటేందుకు తిరంగా యాత్రకు ప్రజలు భారీగా తరలి వచ్చారని ఏపీ బీజేపీ అధ్యక్షు రాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. 2014 సంవత్సరం నుంచి సమర్థవంతమైన నాయకత్వం దేశానికి లభించిందని గుర్తుచేశారు. దేశ భద్రతకు ఆటంకం కలిగిస్తే ఎదురు దాడి చాలా తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. ఇటీవల మన వాళ్లను ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్న ఘటనలో పాకిస్థాన్‌కు జవాబు దీటుగా ఇచ్చా మని దగ్గుబాటి పురందేశ్వరి ఉద్ఘాటించారు. మన పౌరుల పై పాకిస్థాన్ దాడులు చేస్తే, వారి స్థావరాలను ధ్వంసం చేశాం. సరి హద్దుల్లో వారి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశప్రజలకు రక్షణ వలయంగా నిలబడుతున్న సైనికులకు, ప్రధాని మోదీకి సంఘీభావంగా ఈ తిరంగా యాత్ర చేపట్టాం. ఈ యాత్రకు అందరూ స్వచ్ఛందంగా వచ్చారు. మన రాష్ట్రానికి చెందిన ముద్దుబిడ్డ మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోయిన సందర్భంలో దీటైన సమాధానం ఇచ్చారు. ఉగ్రవాదం, చర్చలు సమాంతరంగా వెళ్లలేవు. ఉగ్రవాదం, వాణిజ్యం సమాంతరంగా వెళ్లకూడదని మోదీ స్పష్టంగా చెప్పారు. నీరు, రక్తం సమాంతరంగా పారలేవనే ధృడమైన సందేశాన్ని ప్రధాని మోదీ పొరుగు దేశానికి ఇచ్చారు. పాకిస్థాన్ నేడు తోకముడిచి మన ప్రభుత్వానికి సింధూ జలాలను వదలాలని లేఖ రాసింది. మన దేశం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో సైనికులకు అండగా ఉంటూ ప్రజలంతా సంఘీభావం తెలిపారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తితో సైనికులు, మోదీకి ప్రజలంతా అండగా ఉండాలి అని దగ్గుబాటి పురందేశ్వరి చెప్పుకొచ్చారు.

# సంపాదకీయం

## ముగిసిన యుద్ధం, మిగిలిన ప్రశ్నలు

'మన తోబుట్టువుల, కుమార్తెల సిందూరాన్ని తుడిచివేసిన పర్యవసానమేమిటో నేడు ప్రతి ఉగ్రవాదికి, ప్రతి ఉగ్రవాద సంస్థకు తెలిసి వచ్చింది. ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక పేరు కాదు, కోట్లాది భారతీయుల మనోభావాలకు ప్రతిబింబం'... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం రాత్రి జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలోని మాటలవి. భారత్, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఆపరేషన్ సిందూర్‌లో ఒక విరామం మాత్రమేనని దేశ ప్రజలు విశ్వసించేలా చేసేందుకు ఆయన ప్రయత్నించారు. మోదీ స్వాభావిక వాక్చాతుర్యం, శ్రోతలను సమ్మోహం చేసే మాటకారితనం ఆ ప్రసంగంలో బాగా కనిపించాయి. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న పాకిస్థాన్‌కు భారీ నష్టాన్ని కలిగించడంలో ఆపరేషన్ సిందూర్ సఫలమయిందని మోదీ అన్నారు. తాత్కాలిక కాల్పుల విరమణ ప్రాతిపదికన కొత్త లక్ష్మణ రేఖలు నిర్దేశిస్తూ పాకిస్థాన్ ప్రభుత్వంతో చర్చలు ఉగ్రవాదం, ఆక్రమిత కశ్మీర్‌పైన మాత్రమే జరుగుతాయని ప్రధానమంత్రి ప్రకటించారు. ఇస్లామాబాద్ పాలకులు అణ్వస్త్రాల బూచిని చూపుతూ పాల్పడుతున్న బ్లాక్ మెయిల్‌కు భారత్ బెదరదు, జడవదు అని, మళ్లీ రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తే కఠినంగా ప్రతిస్పందించేందుకు భారత సైన్యం సదా యుద్ధ సన్నద్ధమై ఉందని నరేంద్రమోదీ హెచ్చరించారు. ఒకపక్క, ఇక్కడ, ఇలా, భారత రాజకీయాల శక్తిమంతుడు తాను పాకిస్థాన్‌ను కాళ్లబేరానికి రప్పించాకనే కాల్పుల విరమణ జరిగిందంటూ టీవీలో ప్రసంగిస్తుండగానే అక్కడ వేలమైళ్ల దూరంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ కథనానికి వరుస తూట్లుపొడిచాడు. తాను, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో తీవ్ర ప్రయత్నాలు చేసి దక్షిణ ఆసియాలోని రెండు అణ్వస్త్ర రాజ్యాలను కాల్పుల విరమణకు ఒప్పించామని ట్రంప్ పేర్కొన్నారు. ప్రపంచ మీడియా పతాక శీర్షికల్లో ఉండేందుకు మోదీ కంటే ఎక్కువగా ట్రంప్ ఆరాటపడడం గత కొద్ది రోజుల్లో ఇది మూడోసారి. కాల్పుల విరమణకు అంగీకరించినట్టు భారత్, పాకిస్థాన్ ప్రభుత్వాలు ప్రకటించకముందే ట్రంప్ ఆ విషయాన్ని తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో వెల్లడించారు. మరి కొద్ది గంటల్లోనే, భారత్, పాకిస్థాన్‌లకు నచ్చచెప్పేందుకు అమెరికా ప్రభుత్వం రాత్రికి రాత్రి చేసిన ప్రయత్నాల గురించి సవివరంగా ట్వీట్ చేశారు. కశ్మీర్ వివాదాన్ని పరిష్కరించేందుకు తాను మధ్యవర్తిత్వం నెరపుతానని కూడా ఆయన ప్రతిపాదించారు. మే 12న వైట్ హౌజ్‌లో మీడియా రోజువారీ గోష్ఠిలో ట్రంప్ ఆశువుగా చేసిన వ్యాఖ్యలు ఇంటా బయటా అసాధారణ వ్యక్తిలా వ్యవహరించే ప్రధాని మోదీని చిన్నబుచ్చేవిగా ఉన్నాయి. భారత్, పాకిస్థాన్‌లతో వాణిజ్య సంబంధాలను పూర్తిగా నిలిపివేస్తామని ఉభయ దేశాల ప్రధానమంత్రులకు గద్దించి చెప్పడం ద్వారా ఈ ఘర్షణ నుంచి విరమించుకునేలా చేశామని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇలా ట్రంప్ తనను వెంటాడడం కొనసాగుతుండడంతో సర్వత్రా తనకు ప్రచారాన్ని, ప్రాధాన్యాన్ని పొందడంలో అనితరసాధ్యుడైన మోదీ, ఇప్పుడు ఆ విషయంలో ఇబ్బందుల్లో పడ్డారు! భారత్ పాకిస్థాన్‌ల మధ్య సైనిక ఘర్షణలు తమ ప్రయత్నాల వల్లనే నిలిచిపోయానని అమెరికా ఘనంగా చెప్పుకున్న అంశాన్ని, కశ్మీర్ వివాదాన్ని పరిష్కరించేందుకు తాను మధ్యవర్తిత్వం నెరపుతానన్న ట్రంప్ ప్రతిపాదనను ప్రధాని మోదీ తన ప్రసంగంలో మాట మాత్రంగానైనా స్పృశించకుండా యథావిధిగా తన ఉద్వేగపూరితమైన ప్రసంగంలో ప్రజలను ముంచెత్తారు. పాకిస్థాన్ నాయకులు తమ ప్రసంగాల్లో అమెరికా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలుపగా, అమెరికా ఉనికిని భారత్ కనీసమాత్రంగానైనా అంగీకరించలేదు. భారతీయ ఆడపడుచుల నుదుటి 'సిందూరం'ను ఉగ్రవాదులు తుడిచేశారని మోదీ తన ప్రసంగంలో పదే పదే ప్రస్తావించడం ద్వారా ప్రజల్లో భావోద్వేగాలను పురిగొల్పారు. అమెరికా వ్యాఖ్యలు, వాటిపై నరేంద్ర మోదీ మౌనం వహించడం ప్రతిపక్షాలకు ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించేందుకు వీలు కల్పించింది. ప్రధానమంత్రిని 'విశ్వగురు'గా ఆరాధిస్తున్న భారతీయ జనతా పార్టీ శ్రేణులను ఈ పరిణామం కలవరపరుస్తోంది. మోదీ తన విదేశీ పర్యటనలలోను లేదా భారత్ పర్యటనకు వచ్చిన అంతర్జాతీయ నాయకులను ప్రేమపూర్వకంగా ఆలింగనం చేసుకోవడం లేదా అభినందనపూర్వకంగా వారి వెన్నుచరచడం పరిపాటి. అలాంటిది ఇప్పుడు ట్రంప్ ఆయన్ను, పాకిస్థాన్ ప్రధానమంత్రిని సమరీతిలో గౌరవించడం, ఇరువురినీ ఒకే నాణేనికి బొమ్మా బొరుసులాగా పేర్కొనడం ద్వారా మోదీని తీవ్ర ఇబ్బందికి లోను చేశారు. ట్రంప్ తీరుతో మోదీ ప్రతిష్ఠ దెబ్బతిన్నది. విధేయ మీడియా, సామాజిక మాధ్యమాల శ్రేణులు ఎంతగా ప్రయత్నించినప్పటికీ జరిగిన నష్టాన్ని భర్తీచేయడం అసాధ్యంగా ఉన్నది. ఆకస్మికంగా, అనూహ్యంగా అమలు జరిగిన కాల్పుల విరమణను యుద్ధోన్మాదులు హర్షించలేకపోయారు. యుద్ధం చుట్టూ బీజేపీ నిర్మిస్తూవచ్చిన దేశభక్తియుత, ఉద్వేగపూరిత వాతావరణాన్ని ఒక్కసారిగా ఛిద్రంచేసిన నిర్ణయమది. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పే అవకాశం వ్యర్థమయిందని వారి బాధ. ఉభయ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింతగా తీవ్రమయ్యేందుకు వారు ఎంతగా ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదు. పహల్గాం ఊచకోతలకు ప్రతీకారంగా భారత్, పాకిస్థాన్‌ల మధ్య రగుల్కొనే సైనిక ఘర్షణల గురించి ఈ యుద్ధోన్మాదులు అసాధారణ ఊహలు చేశారు. భారత సైనిక దళాలు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకుంటాయని, బంగ్లాదేశ్‌ను విముక్తం చేసినట్లుగానే బలూచిస్థాన్‌ను పాకిస్థాన్ శృంఖలాల నుంచి విడిపిస్తాయని వారు ఆశించారు. కానీ, ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌కు భారీ నష్టాలు వాటిల్లాయని నిరూపించే గట్టి సాక్ష్యాధారాలు ఏవీ ప్రజల దృష్టికి రాలేదు. పైగా పాకిస్థాన్‌ను చావుదెబ్బకొట్టే అవకాశం వచ్చినా కూడా, అంతలోగానే అమెరికా ఒత్తిడికి మోదీ ప్రభుత్వం లొంగిపోయి కాల్పుల విరమణకు అంగీకరించిందనే అభిప్రాయం ప్రజలకు కలిగింది. ప్రధానమంత్రి వ్యవహరించిన తీరుపట్ల అసంతృప్తితో సామాజిక మాధ్యమాలలో ట్వీట్లు వెల్లువెత్తాయి. కాల్పుల విరమణను ప్రకటించిన విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి, ఆయన కుటుంబ సభ్యులకు వ్యతిరేకంగా కూడా పోకిరీ వ్యాఖ్యలు వెల్లువెత్తాయి. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పవిత్ర యుద్ధాన్ని ప్రారంభించాలని సంఖ్యానేకులు డిమాండ్ చేశారు. ఈ ధోరణులకు వ్యతిరేకంగా మే 13 రాత్రి మోదీ చాలా కఠినంగా మాట్లాడినప్పటికీ, ఆయన మాటలు వారి ఆవేశాన్ని తగ్గించలేకపోవచ్చు. కశ్మీర్‌పై పాకిస్థాన్‌తో ఘర్షించడంలో ముందుకు సాగడంపై తమ మద్దతుదారుల ఆకాంక్షలు, అంచనాలను సహేతుకంగా ఉండేలా చేయడంలో ప్రధానమంత్రి, పాలక బీజేపీ చాలా కృషి చేయవలసిన అవసరమున్నది. తీవ్ర జాతీయవాద ఉన్మాదం లేదా దేశీయ రాజకీయాలలో తన ప్రభావ ప్రాబల్యాలు నిర్దేశించే విధానాలను అనుసరించడం వల్ల ఎదురయ్యే ప్రమాదాల గురించి ప్రధాని మోదీకి కచ్చితంగా తెలుసు. పాకిస్థాన్ సమీప భవిష్యత్తులో ఉగ్రవాద, సైనిక దుస్సాహసాలకు పాల్పడే అవకాశం లేదు కనుక భారత్‌కు తక్షణ సవాళ్లు దౌత్య రంగంలోనే ఎదురవుతాయి. అణుయుద్ధం కొద్దిలో తప్పిపోయిందని చెప్పడం ద్వారా కశ్మీర్ వివాదాన్ని అంతర్జాతీయ సమస్యగా చేసేందుకు ఇస్లామాబాద్ ప్రయత్నించి, సఫలమయ్యే అవకాశమున్నది. మే 7 అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు స్పష్టం చేస్తున్న ప్రధానాంశం ఒకటి ఉన్నది. అది: అమెరికా అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ ఉన్నందున పాత వ్యూహాత్మక నిశ్చితాలు ఏవీ ఇక చెల్లుబాటు కావు. అంతర్జాతీయ వ్యవహారాలలో తనను తాను ఒక స్వతంత్ర శక్తిగా పరిగణించుకుంటున్న ఇండియా తాత్కాలికంగా ప్రతికూలతలను ఎదుర్కోవలసి రావడం తప్పనిసరి. కశ్మీర్ వివాదంలో అంతర్జాతీయ మధ్యవర్తిత్వాన్ని పాకిస్థాన్ మొదటి నుంచీ అంగీకరిస్తున్న దృష్ట్యా భారత్ సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కోవలిసి ఉంటుంది. ఈ వాస్తవాల దృష్ట్యా భారత్ దౌత్య వ్యూహాలు పటిష్ఠంగా ఉండాలి. అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రధానమంత్రి స్వయంగా చొరవ తీసుకోవాలి.

# రాష్ట్రంలో పెట్టుబడులకు సిఎం చంద్రబాబు బ్రాండే కారణం : మంత్రి లోకేష్

## - రూ.22 వేల కోట్ల ప్రాజెక్టుకు నారా లోకేశ్ శంకుస్థాపన








**అనంతపురం, మే 16 (పెన్ సత్తా):** దేశంలో ఎన్నో సంపన్న రాష్ట్రాలు పెట్టుబడులను ఇట్టే ఆకర్షిస్తున్నాయి, వాటితో విపరీతమైన పోటీ ఉంన్నా రాష్ట ప్రభుత్వం పెట్టు బడుల్ని ఆకర్షిస్తోంది. రాష్ట్రంలో పలు సంస్థలు పెట్టుబడి పెట్టడానికి సిఎం చంద్రబాబు బ్రాండే కారణమని మంత్రి లోకేష్ అన్నారు. శుక్రవారం గుత్తి మండలం, బేతపల్లి వద్ద రూ.22 వేల కోట్ల పెట్టుబడులతో రెన్యూ సంస్థ చేపట్టిన సోలార్ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. రెన్యూ సంస్థ చైర్మన్, సీఈఓ సుమంత్ సిన్హా, తదితర జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని అన్నారు. వివిధ సంస్థలు పెట్టుబడి పెట్టడానికి సిఎం చంద్రబాబు బ్రాండే కారణమని చెప్పారు. రాయలసీమలో రెన్యూ విద్యుత్ కాంప్లెక్స్ ఏర్పాటుతో 10 వేల మందికి ఉద్యోగాలు కల్పించే బాధ్యత తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. నేలపై ఉత్పత్తయ్యే విద్యుత్ రాష్ట్రానికే కాకుండా దేశ అవసరాలకు కూడా ఉపయోగపడనుందని తెలిపారు. దీన్ని రెన్యూ పవర్ సంస్థ రూ. 22 వేల కోట్ల పెట్టుబడితో నిర్మించనుంది. ఈ భారీ ప్రాజెక్టుకు ఇవాళ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశంలో పెట్టు బడి పెట్టడానికి అత్యంత అనుకూల రాష్ట్రంగా మార్చుతుందని లోకేష్ అన్నారు. అలాగే ఏపీని పరిశుభ్ర ఇంధన కేంద్రంగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కాంప్లెక్స్ రాష్ట్ర ఆర్థిక వృద్ధికీ, స్థిరమైన అభివృద్ధికీ దారి చూపిస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ కాంప్లెక్స్ బేతపల్లి గ్రామంలో నిర్మితమవుతుంది. ఇది 1,800 మెగావాట్ల సౌర విద్యుత్తు, 1,000 మెగావాట్ల విండ్ పవర్, 2,000 మెగావాట్ గంటల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బిఈఎస్ఎస్)ను ఉత్పత్తి చేస్తుంది. మొదటి దశలో రూ. 7,000 కోట్లతో 587 మెగావాట్ల సౌర విద్యుత్తు, 250.8 మెగావాట్ల గాలి విద్యుత్తు, 415 మెగావాట్ గంటల బిఈఎస్ఎస్‌ను నిర్మిస్తారు. అదనంగా, 25 మెగావాట్ల ఎక్స్‌ట్రా హై వోల్టేజ్ ట్రాన్స్ మిషన్ లైన్ కూడా ఏర్పాటు చేస్తారు. అక్టోబర్ 2024లో ప్రవేశ పెట్టిన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ (ఐసిఈ) పాలసీ కింద ఈ ప్రాజెక్ట్ వస్తోంది. ఇది అతి పెద్ద సంస్థాగత ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది. ఈ పాలసీ ద్వారా ప్రభుత్వం పరిశుభ్ర ఇంధన పెట్టుబడులకు వేగవంతమైన అనుమతులు, ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. ఇలాంటి ప్రాజెక్టులతో విద్యుత్ ఛార్జీలు తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తామని లోకేష్ వెల్లడించారు. గత ప్రభుత్వం రోడ్లపై గుంతలను కూడా పూడ్చలేకపోయిందని విమర్శించారు. ఒక్క పెట్టుబడి కూడా తీసుకురాలేక పోయారన్నారు. ప్రస్తుతం టాటా ఎనర్జీ, టీసీఎస్ సహా అనేక సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయని లోకేష్ వివరించారు. డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులను వచ్చే నెలలో భర్తీ చేస్తామని లోకేష్ వివరించారు.

# కాకాణి అరెస్టుకు పోలీసులకు దొరికేనా



**నెల్లూరు, మే 16 (పెన్ సత్తా):** మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి అరెస్టు ముప్పు మరింత ఎక్కువైంది. ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కూడా తిరస్కరించడంతో కాకాణి అరెస్టు నుంచి తప్పించుకోలేరని అంటున్నారు. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు, అనుమతి లేకుండా పేలుడు పదార్థాలు వాడకం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను కాకాణి ఎదుర్కొంటున్నారు. నెల్లూరు జిల్లా పొదలకూరు పోలీసుస్టేషనులో ఈ కేసులు నమోదు చేయగానే దమ్ముంటే తనను అరెస్టు చేయమని సవాల్ విసిరిన కాకాణి, పోలీసులు విచారణకు పిలవడంతోనే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో ముందస్తు బెయిల్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. ఎక్కడా ఆయనకు అనుకూలంగా తీర్పు రాకపోవడంతో ఇక నేడో, రేపో అరెస్టు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని అంటున్నారు. నెల్లూరు వైసీపీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న కాకాణి గోవర్ధన్ రెడ్డి గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యవసాయ మంత్రిగా పనిచేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యేగా వరుసగా నాలుగుసార్లు గెలిచిన కాకాణి గత ఎన్నికల్లో అనూహ్యంగా ఓడిపోయారు. అదే సమయంలో రాష్ట్రంలో కూడా టీడీపీ కూటమి ఘన విజయం సాధించడంతో కాకాణికి కష్టాలు మొదలయ్యాయి. ఆయన మంత్రిగా ఉండగా, చోటు చేసుకున్న పరిణామాలపై ఫోకస్ చేసిన టీడీపీ నేతలు అక్రమ మైనింగుపై కేసులు పెట్టారు. ఇదే సమయంలో మైనింగు అడ్డుకుంటున్న గిరిజనులను బెదిరించారని మరో కేసు నమోదు చేయించారని చెబుతున్నారు. దీంతో కాకాణి అరెస్టు నుంచి రక్షణ నిమిత్తం హై కోర్టు, సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అక్కడ ప్రతికూల తీర్పు రావడంతో ఆయన భవిష్యత్తుపై ఉత్కంఠ ఎక్కువవుతోంది. పొదలకూరు పోలీసు స్టేషనులో కేసు నమోదు చేసిన తర్వాత, ఆ కేసును తేలిగ్గా తీసుకున్న కాకాణి సుమారు 40 రోజుల పాటు స్వేచ్ఛగా తిరిగారు. పోలీసులు తనకు వ్యతిరేకంగా ఆధారాలు చూపలేరని, తన పై నమోదైన కేసుతో ఏం సాధించలేరని భావించారు. దీంతో దమ్ముంటే తనను అరెస్టు చేయాలని సవాల్ విసిరారని పరిశీలకులు అంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అనూహ్యంగా అక్రమ మైనింగుతో పాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడంతో కాకాణికి ఇబ్బంది తలెత్తిందని అంటున్నారు. ఎప్పుడైతే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుచేసి అరెస్టు తప్పదనే సంకేతాలు ఇవ్వడంతో కాకాణి ఆకస్మాత్తుగా అజ్ఞాతంలోకి వెళ్లిపోవాల్సి వచ్చిందని అంటున్నారు. కేసు విచారణకు రమ్మంటూ ఆయనకు రెండు మూడు నోటీసులిచ్చినా కాకాణి లెక్కచేయలేదు. న్యాయ పోరాటం ద్వారా బెయిల్ తెచ్చుకోవాలని భావించారు. అయితే న్యాయ స్థానాల్లో ఎదురుదెబ్బ తగలడంతో ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. ప్రస్తుతం ఏదైనా కోర్టులో లొంగిపోయి బెయిల్ తెచ్చుకోవడమే ఆయన ముందున్న ఏకైక మార్గమని న్యాయ వాద వర్గాలు చెబుతున్నాయి. గత మూడు నెలలుగా అండర్ గ్రౌండులోనే ఉన్న కాకాణి ప్రస్తుత పరిస్థితుల్లో అరెస్టు నుంచి తప్పించుకోలేరని అంటున్నారు. మరోవైపు సుప్రీం తీర్పు తర్వాత కాకాణి కోసం పోలీసు వేట మొదలైంది. గతంలోనే ఆయనను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు సిబ్బంది మూడు రాష్ట్రాల్లో గాలింపు చేపట్టారు. నెల్లూరుతో పాటు హైదరాబాదులో కాకాణి నివాసాలు, కార్యాలయాల్లో గతంలో తనిఖీలు చేసిన పోలీసులు చెన్నై, బెంగళూరుకు కూడా వెళ్లారని అంటున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ఆయన ఆచూకీ లేకపోవడంతో కాకాణి అనుచరుల కదలికల పైనా నిఘా వేశారని అంటున్నారు. అయితే ముందస్తు బెయిల్ పిటిషన్ పెండింగులో ఉండటంతో కాకాణి సమాచారం పోలీసులకు తెలిసినా, చర్యలకు ఉపక్రమించలేదన్న ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం కోర్టు తీర్పు వెలువడటంతో కాకాణిని అరెస్టు చేయడానికి సిద్ధమవుతున్నారని అంటున్నారు.

# ట్రంప్‌కు షాకిచ్చిన యాపిల్ సిఈవో టిమ్ కుక్ - ఐఫోన్ 17 సిరీస్ తయారీ భారతదేశంలోనే



**అమెరికా, మే 16 :** ప్రపంచ అభివృద్ధి వ్యతిరేకి, అమెరికా అహంకార అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతదేశాన్ని చిన్న చూపు చూస్తూ ఇటీవల చేస్తున్న వ్యాఖ్యలు భారతీయులను షాక్‌కు గురి చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా భారత్లో యాపిల్ కంపెనీలు పెట్టవలసిన అవసరం లేదని, భారత్ లో ఐఫోన్లు తయారు చేస్తున్నందుకు యాపిల్ సంస్థ పైన ఆయన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ బహిరంగంగా వ్యాఖ్యలు చేశారు. ఇండియాలో యాపిల్ కంపెనీలు పెట్టొద్దని ట్రంప్ వ్యాఖ్యలు దోహాలో డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనలో యాపిల్ సీఈవో టిమ్ కుక్‌ని సూచిస్తూ భారత్ తన ప్రయోజనాలను తానే చూసు కోవాలని భారత్ అమెరికా వస్తువులపై టారిఫ్ వసూలు చేయబోమని చెప్పిన సందర్భంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. కంపెనీలు పెట్టడం తనకు నచ్చడం లేదని మీరు భారత్ కు సహాయం చేయాలనుకుంటే ఓకే అన్నారు. ఈ విషయంపై స్పందించిన టిమ్ కుక్ ట్రంప్‌కు షాక్ ఇచ్చారు. ప్రపంచంలోనే అత్యధిక టారిఫ్‌లు వసూలు చేసే దేశాలలో భారత్ ఒకటని అక్కడ అమ్మకం చాలా కష్టంగా ఉంటుందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ క్రమంలో దీని పైన దుమారం కొనసాగుతున్న వేళ యూఎస్ ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యల పైన తాజాగా టిమ్ కుక్ స్పందించారు. ట్రంప్‌కు ఊహించని షాక్ ఇచ్చారు. ఐ ఫోన్ 17 సిరీస్ తయారీ భారతదేశం లోనే యాపిల్ భారత్ ను వదిలి వెళ్ళడం లేదని, యాపిల్ కంపెనీలు భారత్‌లో ఉత్పత్తులను కొనసాగిస్తాయి అని టిమ్ కుక్ వెల్లడించారు. త్వరలోనే ఐఫోన్లు తయారీని మరింత పెంచుతామని ఆయన ప్రకటన చేశారు. ఐ ఫోన్ 17 సిరీస్ తయారీ భారతదేశంలోనే ఉండబోతుందని టిమ్ తెలిపారు. ఐ ఫోన్ ప్రో మోడల్‌ను కూడా తయారు చేస్తామని టాటా ఎలక్ట్రానిక్స్ ముందుకు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. క్లారిటీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఇప్పటికే ఐఫోన్ 17 సిరీస్ తయారీని ఫాక్స్ కాన్ మొదలు పెట్టిందని టిమ్ కుక్ తెలిపారు. ఇక మరోవైపు డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో తాజాగా కేంద్ర ప్రభుత్వ వర్గాలు భారత్లో యాపిల్ కంపెనీల పెట్టుబడుల పైన కీలక వ్యాఖ్యలు చేశాయి. భారత్ నోటి నుంచి ఆపిల్ పండు లాక్కోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆలోచిస్తున్న క్రమంలో, దీని పైన క్లారిటీ ఇచ్చాయి. భారత్‌లో ఐ ఫోన్లను ఉత్పత్తి చేయడానికి భారీ తయారీ కేంద్రం కేంద్ర ప్రభుత్వ వర్గాలు భారతదేశంలో యాపిల్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్నాయి. భారత్లో ఐ ఫోన్లను ఉత్పత్తి చేయడానికి భారీ తయారీ కేంద్రం అవసరం పడుతుందని యాపిల్ తమను కోరినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

# ట్రంప్ ముఖాన డంప్ చేసిన బోయింగ్ 747









**ఖతార్, మే 16:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అత్యంత విలాసవంతమైన బోయింగ్ 747 విమానం ఖతార్ రాజ కుటుంబం బహుమతిగా ఇచ్చిందనే వార్త ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే ఇది కేవలం ఉదారమైన బహుమతి కాదని, పోషించ లేని తెల్ల ఏనుగులాంటి తమ విమానాన్ని తెలివిగా వదిలించుకునే వ్యూహంలో భాగమేనని వైమానిక రంగ నిపుణులు అంటున్నారు. ప్రపంచంలోనే సొంతంగా అతి పెద్ద ప్రైవేట్ జెట్స్ శ్రేణి కలిగిన యజమానుల్లో ఖతార్ రాజకుటుంబం ఒకటి. తమకు ఆర్థిక భారంగా పరిణమించిన కొన్ని భారీ విమానాలను అది క్రమంగా వదిలించు కుంటోంది. ఇందులో భాగంగానే నిర్వహణ భారం మితిమీరిన తెల్ల ఏనుగులాంటి తమ బోయింగ్ 747 జంబోను, దాని ఖర్చులను భరించగల డొనాల్డ్ ట్రంప్ లాంటి సరైన వ్యక్తికి అప్పగించగలిగారు. ట్రంప్ నుంచి లబ్ధి పొందడానికే ఖతార్ ఈ విమానాన్ని బహుమతిగా ఇస్తోందని కొన్ని ఊహాగానాలు వచ్చినా, ఈ వ్యవహారం వెనక అసలు కారణం ఖతార్ రాజ వంశీయులకు ఆ విమానంతో అవసరం తీరిపోవడం. నిజానికి వారు 2020 లోనే ఆ విమానాన్ని అమ్మ కానికి పెట్టారు. కానీ, కొనుగోలుదారు దొరక్క విక్రయంలో విఫల మయ్యారు. ఇప్పుడు తమకు అవసరం లేని ఆ విమానాన్ని ట్రంప్ కు డంప్ చేయడం ద్వారా నిర్వహణ, స్టోరేజి ఖర్చులు బాగానే తగ్గుతాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇది ఒక దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టుగా, ఖతార్‌కు ఖర్చు తగ్గడంతో పాటు, ట్రంప్ కూడా ఉచిత గిఫ్టుతో సంతోషిస్తున్నారు. విమానం వివరాలు, వ్యయ భారం ట్రంప్‌కు బహూకరించిన ఈ విమానం టెయిల్ నంబర్ ఏ 7–హెచ్బీజే, ఇది ఖతార్ మాజీ ప్రధాని హమద్ బిన్ జసిమ్ బిన్ జబర్ అల్ థాని పేరులోని మొదటి అక్షరాలను సూచిస్తుంది. ఈ విమానం ఖతార్ రాజ విమానాల శ్రేణిలో ఉన్న మూడు 747–8 విమానాల్లో ఒకటి. 2012లో 367 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.3,130 కోట్లు) వెచ్చించి కొనుగోలు చేయబడిన ఈ విమానం, కొన్న తర్వాత మూడేళ్ల పాటు వందల కోట్లు ఖర్చు చేసి అత్యంత విలాసవంతంగా మార్పులు చేశారు. సాధారణంగా 467 మంది ప్రయాణించగల బోయింగ్ 747–8లో, మార్పుల తర్వాత కేవలం 89 మంది మాత్రమే ప్రయాణించేలా హంగులు అద్దారు. ఇందులో రెండు పడక గదులు, వినోద గది, సమావేశ గదులు ఉన్నాయి. అయితే, బోయింగ్ 747 సిరీస్ విమానాలను ఆపరేట్ చేయడానికి విపరీతమైన ఖర్చు అవుతుంది. కార్పొరేట్ జెట్ ఇన్వెస్టర్ అంచనా ప్రకారం, 747–8 వీఐపీ వెర్షన్‌ను నడపడానికి గంటకు 23 వేల డాలర్లు (దాదాపు రూ.20 లక్షలు) ఖర్చవుతుంది. పెరుగుతున్న ఇంధన ధరలతో పాటు, ఈ భారీ వ్యయ భారం కారణంగానే గత దశాబ్ద కాలంగా పలు విమానయాన సంస్థలు, ప్రభుత్వాలు, రాజకుటుంబాలు బోయింగ్ 747, ఎయిర్‌బస్ ఏ 340 వంటి నాలుగు ఇంజిన్ల విమానాలను సేవల నుంచి తప్పించి, తక్కువ ఇంధనం వాడే రెండు ఇంజిన్ల బోయింగ్ 787, ఎయిర్ బస్ ఏ 350 వంటి ఆధునిక విమానాలపై ఆధార పడుతున్నాయి. భారీ విమానాలకు లకు తగ్గుతున్న డిమాండ్ పరిమాణంలో పెద్దవైన, అత్యంత సుందరంగా అలంకరించిన, వాడకపోయినా నిరంతరం నిర్వహణ అవసరమైన, విపరీతంగా ఇంధనం తాగే ఇలాంటి పూర్తిగా వ్యక్తిగత అవసరాలకు ఉద్దేశించిన విమానాలకు డిమాండ్ పడిపోయిందని ఈ ఉదంతం చాటుతోంది. బహిరంగ మార్కెట్లో ప్రస్తుతం వీటిని కొనేవారు లేరు. అందుకే రాజ కుటుంబాలు, ప్రభుత్వాలు ఈ తెల్ల ఏనుగులను వదిలించుకునే పనిలో ఉన్నాయి. దుబాయ్ కేంద్రంగా పనిచేసే ఏవియేషన్ కన్సల్టింగ్ సంస్థ బీఏఏ & పార్టనర్స్ మేనేజింగ్ డైరెక్టర్ లైనస్ బాయర్ మాట్లాడుతూ ఖతార్ ప్రస్తుతం నాజూకైన, బహుళ ప్రయోజనకర, ఆర్థికంగా అనుకూలమైన విమానాల వైపు మొగ్గు చూపుతోందని తెలిపారు. అమెరికా అధ్యక్షుడికి బోయింగ్ 747–8 విమానాన్ని అప్పగించడాన్ని ఓ సృజనాత్మక పరిష్కార వ్యూహంగా, ఆకాశంలో పోటాపోటీ బల ప్రదర్శన అనే గతించిన నమూనాకు వీడ్కోలుగా ఆయన అభివర్ణించారు. పెద్ద విమానాలకు పొడవైన రన్‌వేలు అవసరం కావడం, భద్రతాపరంగా అవి పెద్ద లక్ష్యాలుగా మారే ప్రమాదం వంటి కారణాల వల్ల వాటి వినియోగం పరిమితంగా ఉంటుందని నిపుణులు వివరిస్తున్నారు. ట్రంప్ కు బహూకరించిన ఖతారీ విమానం గత ఐదేళ్లలో కేవలం 1,059 గంటలు మాత్రమే ప్రయాణించింది. ఖతార్ మాత్రమే కాదు, సౌదీ అరేబియా, బ్రూనై, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జర్మనీ వంటి దేశాలు కూడా క్రమంగా ఇలాంటి పెద్ద విమానాలను వదిలించుకుంటున్నాయి. గతంలో సౌదీ యువరాజు కోసం కొన్న ఓ 747–8 విమానం కేవలం 42 గంటలే ప్రయాణించి చివరకు 2022 లో తుక్కు కింద ముక్కలు చేయబడింది. బహుమతిగా ట్రంప్ స్వీకరిస్తున్న ఈ విమానాన్ని వినియోగంలోకి తీసుకురావడం అంత సులువు కాదని నిపుణులు అంటున్నారు. భద్రతపరమైన నిబంధనల ప్రకారం ఈ విమానాన్ని విడదీసి పునర్నిర్మించడానికి, అవసరమైన ధృవీకరణ పొందడానికి కనీసం ఐదేళ్లు పట్టవచ్చని అంచనా. అంటే, ఒకవేళ ట్రంప్ తన పదవీ కాలంలో పూర్తి చేసినా ఈ విమానాన్ని వెంటనే ఉపయోగించడం కష్టమే. మొత్తంగా చూస్తే, ఖతార్ తమకు భారం మారిన తెల్ల ఏనుగులాంటి విమానాన్ని ట్రంప్‌కు బహుమతిగా ఇచ్చి తెలివిగా వదిలించుకుంది. ఇది ఖతార్‌కు నిర్వహణ, నిల్వ ఖర్చులను తగ్గిస్తుంది. ట్రంప్‌కు ఉచితంగా విమానం లభించినా, దాని నిర్వహణ, వినియోగం ఆయనకు పెద్ద సవాలుగా మారే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇది కేవలం విమానం మార్పిడి కాదు, ఆధునిక విమానయానంలో మారుతున్న పోకడలకు, ఆర్థిక అంశాలకు ప్రాధాన్యత పెరుగుతున్న తీరుకు అద్దం పడుతోంది.

# దేశ ప్రగతి టెక్నాలజీతోనే సాధ్యం - భూ రికార్డుల రీ సర్వే డిజిటలైజేషన్ జాతీయ వర్క్ షాప్‌లో పెమ్మసాని



**గుంటూరు, మే 16 (పెన్ సత్తా):** భారతదేశ అభివృద్ధి, ప్రగతి అనేది ఆధునిక సాంకేతిక విధానాలతో సాధ్యం అవుతుందిని, దేశంలో ఏడు రాష్ట్రాలు భూ సర్వే డిజిటలైజేషన్లో ముందడుగులో ఉన్నాయి అని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు లోని స్థానిక ఐటీసీ వెల్కమ్ హొటల్లో జరిగిన భూములు సర్వే/ రీసర్వే భూ రికార్డులు డిజిటలైజేషన్ పై కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ జాతీయ వర్క్ షాప్ 2వ రోజు కార్యక్రమానికి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ & అర్బన్ హౌసింగ్ శాఖ మంత్రి పి.నారాయణతో కలిసి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెమ్మసాని మాట్లాడుతూ రెండు రోజులుగా ఈ సమావేశాలను నిర్వహిస్తున్న అధికారులకు, ఉన్నతాధికారులకు నా ధన్యవాదాలు తెలుపుతున్నాను అన్నారు. శాఖ పరంగా, వృత్తిపరంగా విజయవంతమైన పనులు నిర్వహిస్తున్న మీ అందరికీ మా అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ఇది ఒక నిర్ణీత సమయానికి, రాష్ట్రాలకు నిధులు సేకరించడానికి ఈ కార్యక్రమం చక్కగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమం గ్రామీణ సముదాయాలు, మహిళలు, గిరిజనుల పట్ల చాలా కీలకమైనది. మన ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్లుగా, మనం నిజంగా 2047 నాటికి వికసిత భారతంగా మారాలని కోరుకుంటే, ఈ కార్యక్రమాన్ని తప్పనిసరిగా విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఎందు కంటే అభివృద్ధి చెందిన దేశాలు ఈ పని ఎన్నో సంవత్సరాల క్రితమే పూర్తి చేశాయి. మన పరిపాలనా సమస్యలను పరిగణనలోకి తీసుకుంటే కొంత ఆలస్యం జరుగుతున్నదీ నిజమే. కానీ వచ్చే కొన్ని సంవత్సరాలలో మనం 100% పరిష్కారాన్ని సాధించగలమని నాకు ఆశ ఉందన్నారు. మరొక్కసారి, 100% గ్రౌండ్ ప్రూఫింగ్ సాధించినందుకు కర్ణాటక, అస్సాం, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, బీహార్, హర్యానా, ఒడిస్సా రాష్ట్రాలకు అభినందనలు తెలియజేస్తున్నాను. ఇప్పటివరకు పరిష్కరించని భూముల వ్యవహారాన్ని పరిష్కరిస్తున్న అస్సాంను, 40 సెంటీమీటర్ల అధిక–స్పష్టత గల శాటిలైట్ చిత్రాలతో ముందుకు వస్తున్న రాజస్థాన్‌ను కూడా అభినందించాలన్నారు. ఇవన్నీ కాకుండా, మన ఆంధ్రప్రదేశ్ గురించి నాకు చాలా గర్వంగా ఉంది. ముఖ్యమంత్రి, నా రాజకీయ గురువు, నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో, మంత్రి నారాయణ, ఈ శాఖ ఉన్నతాధికారులు మొత్తం పరిపాలనా యంత్రాంగం ఎంతో అద్భుతమైన పనిని కేవలం 10 నెలల్లోనే పూర్తి చేసి, ప్రోత్సాహక నిధులలో సింహభాగాన్ని దక్కించుకున్నారన్నారు. అలాగే, పౌర సాధికారత, సమాజం యొక్క భాగస్వామ్యం కోసం పని చేస్తున్న బీహార్, ఒడిశాను, అత్యంత పారదర్శక భూ రికార్డు వ్యవస్థను అభివృద్ధి చేస్తున్న హర్యాణాను, అలాగే మొదటి, రెండవ తాత్కాలిక సర్వేలు పూర్తి చేసిన శిబ్రాను కూడా అభినందించాలి అన్నారు. ఈ ప్రథమ దశలో, మనం 15 లక్షల చ.కిమీ. ప్రణాళికలో భాగంగా 3 లక్షల చ.కిమీ. భూభాగాన్ని కవర్ చేయగలిగాము. ఈ కాన్ఫరెన్స్ మన దేశంలో సహకార పౌరసత్వ వ్యవస్థను ప్రదర్శిస్తుందని, అది మన దేశ బలమని నేను నమ్ముతున్నాను. ఈ ప్రాజెక్టు పూర్తయ్యే సమయంలో మనకు కచ్చితమైన అందుబాటులో ఉండే భూ రికార్డులు లభిస్తాయి. విధాన పరంగా, సాంకేతికంగా, నిధుల పరంగా, అన్ని ప్రామాణిక కార్యాచరణ పద్ధతుల విషయంలో భారత ప్రభుత్వం మద్దతుగా ఉంటుంది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డిపార్ట్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ & చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జి. జయలక్ష్మి, డి.ఓ.ఎల్.ఆర్ సెక్రెటరీ మనోజ్ జోషి, డి.ఓ.ఎల్.ఆర్ డైరెక్టర్ డి.ఎన్ జోషి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దేవరపల్లి సత్య జన్మదిన వేడుకలు



**చోడవరం, మే 16 (పెన్ సత్తా):** స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చోడవరం టౌన్ పార్టీ అధ్యక్షులు దేవరపల్లి సత్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైసిపి నాయకులు ఆయన పేరిట దేవాలయాల్లో పూజలు జరిపించి పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేయించి స్వీట్లు కేకులు అందరికీ అందజేశారు. ఎంపీపీ గాడి కాసులమ్మ, చోడవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, లక్ష్మీపురం సర్పంచ్ సిరిసోల్ల ఆది గణపతి నాయుడు, ఎంపీటీసీలు బుద్దా గంగరాజు, సుంద్రాన వీరన్న, ఆడారి కోటి భూలోకనాయుడు, మట్టా రాజు నాయుడు, పొట్నూరి అరుణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

# బి.సి.టి వద్ద స్థలాలు కేటాయించాలంటూ వినతిపత్రం

**రాంబిల్లి, మే 16 (పెన్ సత్తా):** మండలంలో కృష్ణంపాలెం శివారు నారప్పపాలెం గ్రామాన్ని తరలించే క్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారులు నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి నిమిత్తం ఈ నెల 6వ తేదీన రూ.8.36 లక్షలు ప్రకటించారు. దీని పై గ్రామస్తులంతా తాము అంగీకరించడం లేదంటూ, తమకు రూ. 25 లక్షలు కావాలని డిమాండ్ చేశారు. అలాగే అచ్యుతాపురం మండలం రావిపాలెం తమ గ్రామాన్ని తరలిస్తారన్నారని, కానీ తాము కంపెనీలో ఏదైనా ఉద్యోగానికి రావాలి అంటే సుమారు 22 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది కనుక తమకు సమీప గ్రామమైన వెంకటాపురం బి.సి.టి వద్ద గల ప్రభుత్వ స్థలం కేటాయించాలంటూ శుక్రవారం రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవి కుమార్ కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నారప్పపాలెం గ్రామస్తులు పాల్గొన్నారు.



# పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎస్పీ



**విజయనగరం, మే 16 (పెన్ సత్తా):** జిల్లా పోలీసు శాఖలో వివిధ హెరీదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించి, సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించి, పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించుటలో భాగంగా పోలీసు సిబ్బంది ఒక్కొక్కరిని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయం లోని తన చాంబరులోకి పిలిచి, వారి వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసు కొని, వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది విజ్ఞాపనలు పరిశీలించిన జిల్లా ఎస్పీ, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. పోలీసు సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను జిల్లా ఎస్పీ స్వయంగా పుస్తకంలో నోట్ చేసుకొని, వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.



# జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా అవగాహనా కార్యక్రమం

**మునగపాక, మే 16 (పెన్ సత్తా):** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా, పీహెచ్ సి పరిధిలో ఉన్న గ్రామాలలో అవగాహనా కార్యక్రమములు నిర్వహించడమైనది. మూలపేట గ్రామములో వైద్యాధికారిణి డా.ఎన్ విమలగిరి మాట్లాడుతూ, డెంగ్యూ వ్యాధి దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని, దోమల పెరగకుండా ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రతలు తీసుకోవాలని వివరించారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలని ప్రజలకు అవగాహన కలుగచేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో మహిళా సంరక్షణ, పోలీసు సిబ్బంది విధులే క్రియాశీలకం : ఎస్పీ

**విజయనగరం, మే 16 (పెన్ సత్తా):** పాత నేరస్థులు, హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులు, ఒంటరి మహిళలు, శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నమయ్యే అంశాలు గురించి సంపూర్ణ అవగాహన ఉండాలన్న జిల్లా ఎస్పీ వకుల్ జిందల్. నేర నియంత్రణకు క్షేత్ర స్థాయిలో మహిళా సంరక్షణ పోలీసులు (ఎం.ఎస్.పి.లు), పోలీసు సిబ్బంది నిర్వహించే విధులే క్రియాశీలకమని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. డెంకాడ పోలీసు స్టేషను ప్రక్కనే అభివృద్ధి పర్చిన భవనంలో ఏర్పాటు చేసిన భోగాపురం సర్కిల్ కార్యాలయాన్ని, సిఐ చాంబరును జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ప్రారంభించి, పోలీసు స్టేషన్ ప్రాంగణంలో మొక్కలను నాటారు. అనంతరం, మహిళా సంరక్షణ పోలీసులు (ఎం.ఎస్.పి.లు), పోలీసు స్టేషను సిబ్బందితో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మమేకమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ నేర నియంత్రణ, సమాచార సేకరణ, నిఘా ఏర్పాటు చేయుటలో క్షేత్ర స్థాయిలో మహిళా సంరక్షణ పోలీసులు, దత్తత పోలీసులు నిర్వహించే విధులే



క్రియాశీలకమన్నారు. మహిళా పోలీసులు నిర్వహించే విధులను పర్యవేక్షించేందుకు ఇటీవలనే ప్రత్యేకంగా వెబ్సైట్ను ప్రారంభించామన్నారు. ఈ వెబ్సైట్ మహిళా సంరక్షణ పోలీసులకు ఏవిధంగా ఉపయోగపడుతున్నదన్న విషయాలను ఎం.ఎస్.పి.లను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఎం.ఎస్.పి.లు తమ పరిధిలో ఉన్న గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేయాలని, క్రొత్తగా వచ్చే వ్యక్తులు గురించి, ఒంటరి మహిళలు, పాత నేరస్థులు, హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తుల ప్రవర్తన గురించి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అంతే కాకుండా, నేర నియంత్రణకు ముఖ్య ప్రాంతాల్లో సిసి కెమెరాల ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. ఎం.ఎస్.పి.లు నిర్వహించే విధులను ఎప్పటి కప్పుడు ప్రత్యేకంగా రూపొందించిన వెబ్సైట్లో నిక్షిప్తం చేయాలన్నారు. వెబ్సైట్లో నిక్షిప్తం చేసిన విధులను ప్రతీ మాసం పర్యవేక్షించి, ఉత్తమంగా సేవలందించే వారిని ప్రోత్సహిస్తామన్నారు. అనంతరం, భోగాపురం సర్కిల్ పరిధిలోని పోలీసు సిబ్బందితో మమేకమయ్యారు. ఈ-బీట్స్ సమర్ధవంతంగా అమలు చేయాలని, దత్తతగా గ్రామాలను విధిగా సందర్శించాలని, గ్రామంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, సమాచారాన్ని సంబంధిత ఎస్.హెచ్.ఓ.కు అందించాలన్నారు.

దత్తత గ్రామంలో నిఘా ఏర్పాటు చేయాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అంశాలు, భూ తగాదాలు గురించి కుణ్ణంగా తెలుసుకోవాలని, సమాచారాన్ని ఉన్నతాధికారులకు సకాలంలో అందించాలన్నారు. పోలీసు స్టేషను పరిధిలో ఎటు వంటి శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీసు అధికారులు, సిబ్బంది, ఎం.ఎస్.పి.లు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ, ఎస్బీ సిఐలు ఎవి లీలారావు, ఆర్.వి. ఆర్.కే.చౌదరి, ఎస్ఐలు ఎ.సన్యాసి నాయుడు, ఐ.దుర్గా ప్రసాద్, గణేష్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సమ్మెను జయప్రదం చేయండి

**గాజువాక, మే 16 (పెన్ సత్తా):** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో మే 20వ తారీకు సమ్మెను జయప్రదం చేయండి అని స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాలు కార్మికులకు పిలుపునిచ్చాయి. శుక్రవారం స్టీల్ ప్లాంట్ బిసి గెట్ వద్ద స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20 సమ్మె, స్టీల్ కార్మికులకు సస్పెన్షన్, షో కాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలని, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించరాదని ప్రధాన డిమాండ్లతో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు స్టీల్ సిఐటియు గౌరవ అధ్యక్షులు జె అయోధ్యరామ్ అధ్యక్షత వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా సిఐటి నాయకులు ఎన్ రామారావు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌లో అప్రకటిత ఎమర్జెన్సీని యాజమాన్యం అనుసరిస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, సుప్రీంకోర్టు తీర్పులను ఉల్లంఘిస్తూ యాజమాన్యం వైఖరి ఉందని ఆయన వివరించారు. ప్రభుత్వ యాజమాన్యాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా గళం ఎత్తిన కార్మిక సంఘాలను, కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు దిగడం అత్యంత దుర్మార్గమని ఆయన అన్నారు. పూర్తిస్థాయి ఉత్పత్తి స్టీల్ ప్లాంట్‌లో జరగాలంటే తగిన మానవ వనరులు ఉండాలని యాజమాన్యానికి తెలీదా అని ఆయన ప్రశ్నించారు. కార్మిక సమస్యలను సృష్టిస్తూ యాజమాన్యం అనైతికంగా వ్యవహరిస్తుందని దీనికి వ్యతిరేకంగా కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపునకు ఆపాలని మే 20వ తారీకు జరిగే సమయం పెద్దఎత్తున కార్మిక వర్గం పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తపు సమ్మె వాయిదా పడినప్పటికీ విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా మే 20వ తారీకు విశాఖ ఉక్కు కర్మాగారంలో పెద్ద ఎత్తున సమ్మెలో కార్మిక వర్గం పాల్గొనాలని ఆయన అన్నారు. దీనికి




ప్రధాన కారణం స్టీల్ యాజమాన్యం స్టీల్ కార్మికులకు నేటికీ పూర్తి వేతనాలు చెల్లించడంలో వైఫల్యం చెందిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. అలాగే హెచ్ఆర్ఏ, కరెంటు చార్జీలు పెంపుతో కార్మికులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను వారి ఉపాధి నుండి దూరం చేసి స్టీల్ ప్లాంట్ ఉత్పత్తులకు తీవ్ర విఘాతాన్ని సృష్టిస్తున్నారని ఆయన వివరించారు. యాజమాన్యం ఇదే వైఖరిని కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ఆయన హెచ్చరించారు. సభాధ్యక్షులు జె అయోధ్య రామ్, స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు డివి రమణా రెడ్డి, టి జగదీష్, జె రామకృష్ణ మాట్లాడుతూ స్టీల్ యాజమాన్యం అనైతికంగా అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కార్మిక వర్గం మే 20 జరిగే సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై టి దాస్, యు రామస్వామి, స్టీల్ ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు బి తౌడన్న, ఎఐటియుసి నాయకులు మసేన్ రావు, స్టీల్ సిఐటియు నాయకులు పి శ్రీనివాసరాజు, మరిడయ్య, టి వి కె రాజు, వి ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, మహేష్, రాజు, శ్రీనివాస్ తదితరులతో పాటు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

# దేశం కోసం సైన్యం, సైన్యం కోసం మనం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

## - తిరంగా యాత్రను విజయవంతం చేద్దాం : ఎమ్మెల్యే పిలుపు

**రాజమహేంద్రవరం, మే 16 (పెన్ సత్తా):** పహల్గామ్ ఉగ్రవాదుల దాడికి ప్రతిచర్యగా ఆపరేషన్ సింధూర్ ద్వారా ప్రపంచానికి మన సైనిక శక్తిని తెలియచేసి, ఇది మన సైనికుల వీరత్వానికి, మన దేశ సార్వభౌమాధికారానికి నిదర్శనమని చాటి చెప్పడం జరిగిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు నగరంలో తిరంగ యాత్ర దేశ భక్తుల ర్యాలీ నిర్వహించడం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం ఆయన తిలక్ రోడ్డు లోని తన కార్యాలయంలో పార్టీ నగర సమన్వయ కమిటీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ దేశ ప్రజలందరికీ గర్వకాణ మైన విజయమని, దేశ భద్రతను కాపాడేందుకు త్రివిధ దళాల సంకల్పాన్ని ఈ ఆపరేషన్ పునరుద్ఘాటించిం



దన్నారు. ఈ అఖండ విజయానికి దేశం మొత్తం సెల్యూట్ చేస్తున్నందున మనమంతా సాయుధ దళాలకు సమిష్టిగా కృతజ్ఞతాభినందనలు తెలియచేయాల్సిన అవసరం ఉందని, ఆపరేషన్ సిందూర్ అఖండ విజయం సాధించడం పట్ల మన దేశ సాయుధ దళాల శౌర్యం, ధైర్యం, త్యాగాలను గౌరవించడానికి తిరంగ యాత్ర నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ తిరంగ యాత్ర శనివారం సాయంత్రం 4 గంటలకు పుష్కరాల రేవు నుంచి కోటగుమ్మం మెయిన్ రోడ్డు మీదుగా కోటిపల్లి బస్టాండ్ వరకూ కూటమి నాయకులు, ప్రజలతో కలిసి జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీల జెండాలు లేకుండా సుమారు 5 వేల జాతీయ పతాకాలతో ఈ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మన సైనికులకు, దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమర్ధన తెలియజేస్తూ తిరంగా యాత్ర నిర్వహించి భారత్ సైన్యంతో మేము ఉన్నామనే సంకేతం ఇచ్చేందుకే ఈ ర్యాలీ నిర్వహించడం జరుగుతోందన్నారు. దేశం మొత్తం ఆపరేషన్ సింధూర్ వెంటే ఉంది అంటూ మన త్రివిధ దళాల సైన్యానికి మనో ధైర్యాన్ని, కొండంత ఉత్సాహాన్ని కల్పిస్తూ, మన జాతీయ జెండాను చేత పట్టుకుని మనం, మన స్నేహితులు, అదే విధంగా సమాజంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని, మన కర్తవ్యాన్ని నిర్వహించే ఈ ర్యాలీకి బాధ్యత కలిగిన దేశ పౌరులంతా హాజరు కావాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అనంతరం నగరంలో నిర్వహించబోయే మినీ మహానాడు, ఈ నెల 27, 28 తేదీల్లో కడపలో జరగబోయే మహానాడు రాజమహేంద్రవరం నుంచి ఎంత మంది వెళ్లాలి, ఎలా వెళ్లాలనే తదితర అంశాల పై చర్చించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కాశి నవీన్ కుమార్, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, దొండపాటి సత్యంబాబు, నల్లం శ్రీను, రాచపల్లి ప్రసాద్, మాటూరి రంగారావు, నిమ్మలపూడి గోవింద్, కంటిపూడి శ్రీను, కొల్లి బుజ్జి, ద్వారా పార్వతి సుందరి, కోసూరి చండీప్రియ, కప్పల వెలుగు కుమారి, శెట్టి జగదీష్, కురుమిల్లి విజయశేఖర్, మొకమాటి సత్యనారాయణ, చాపల చిన్నరాజు, జవ్వాది మురళి, సయ్యద్ అప్సరి, మదీనా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ డెంగ్యూ డే సందర్భంగా అవగాహన సదస్సులు, ర్యాలీలు



**యస్.రాయవరం, మే 16 (పెన్ సత్తా):** మండలం సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల అన్ని గ్రామాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. శుక్రవారం ఈ కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి కె.వరహాలు దొర ఆదేశాలు మేరకు నేషనల్ డెంగ్యూ దినోత్సవం పురస్కరించుకొని అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్.ఎన్ వాసంతి తెలిపారు. అందులో భాగంగా జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి పి.జె.ఎం.అర్.పి.నాయుడు సూచనలతో అన్ని గ్రామాల్లో ఆరోగ్య విస్తరణ అధికారి టి నాగేశ్వరరావు పర్యవేక్షణలో, పి.హెచ్.ఎన్.ఎం.రత్న సఖి, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్ ఎస్ వి ప్రకాష్ ఆధ్వర్యంలో సర్వసిద్ధి, ఎస్.రాయవరం, వాకపాడు గ్రామాల్లో కీటక జనిత వ్యాధులయిన డెంగ్యూ వ్యాధి ఈడిస్, ఈజిప్ట్ అనే టైగర్ దోమ కాటు వలన ఈ సీజన్‌లో వస్తాయని జ్వరం, తలనొప్పి, కనుగుడ్లు నొప్పి, ఒళ్ళు నొప్పులు, కండరాల నొప్పులు లక్షణాలుగా వుంటాయని కావున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పిస్తూ సదస్సు, ర్యాలీ నిర్వహించామని తెలిపారు. ఈ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ, అలాగే ఇంట్లో నిలువ వున్న నీటి పాత్రలపై మూతలు ఉంచుకోవాలని, తద్వారా కీటక జనిత వ్యాధులకు కారణమైన దోమలను లార్వా దశలోనే సులభంగా అరికట్టవచ్చునని దీని కొరకు ఫ్రై డే డ్రై డే సందర్భంగా మనం ప్రతి శుక్రవారం, శనివారం, అదివారం నిర్వహించే యాంటీ లార్వా ఆపరేషన్ వలన నిల్వ నీటిలో వుండే అనగా ఫ్రిజ్ వెనుక తొట్టెలో, టైర్‌లలో, రుబ్బు రోళ్లులో, ప్లాస్టిక్ డ్రమ్ములులో, పాడుపడిన పాత్రలు, ఎయిర్ కూలర్‌లలో, కొబ్బరి చిప్పలులో, సిమెంట్ గోలల్లో, డ్రింక్ సీసాలులో, పూల కుండీలులో లార్వాలను గుర్తించి తక్షణం వాటిని నిర్మూలించవచ్చునని తద్వారా దోమల వృద్ధిని లార్వా దశలోనే అరికట్టగలమని అవగాహన కల్పించారు. తదుపరి అవగాహన ర్యాలీలో 1. తరిమేద్దాం తరిమేద్దాం, డెంగ్యూ వ్యాధిని తరిమేద్దాం. 2. దోమ కాటు మనకు చేటు. 3.దోమలు లేని ఇల్లు, జ్వరాలు అక్కడ నిల్. 4. నీటి నిల్వలున్న ఇల్లు దోమలకది పుట్టినిల్లు అనే నినాదాలతో హెల్త్ సూపర్వైజర్ ఎస్.ఎస్.వి.ప్రకాష్ ఆధ్వర్యంలో హెల్త్ అసిస్టెంట్ బి.ప్రేమ్ కుమార్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. వీరితో పాటు ఆసుపత్రి సిబ్బంది ల్యాబ్ టెక్నీషియన్ ఇందల హరినాథ్, స్టాఫ్ నర్సు వెంకట్, సచివాలయం హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# తుల్‌బుల్‌పై ఒమర్, మెహబూబా మాటల తూటాలు



**శ్రీనగర్, మే 16:** సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన నేపథ్యంలో ఊలర్ సరస్సుపై గతంలో తలపెట్టిన తుల్ బుల్ నేవిగేషన్ ప్రాజెక్టును పునరుద్ధరించే ఆలోచనలో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం ఉంది. అయితే, ఒమర్ అబ్దుల్లా అభిప్రాయంతో జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ విభేదించారు. దీంతో శుక్రవారం నాడు ఈ ఇద్దరు నేతల మధ్య సోషల్ మీడియా ఎక్స్‌లో మాటల యుద్ధం జరిగింది. అత్యంత అవసరమైన, జీవనాధారమైన నీటిని ఆయుధంగా మార్చడం అవమానవీయమని ఒమర్‌ను మెహబూబా ముఫ్తీ విమర్శించగా సరిహద్దుకు అవతల ఉన్నవారి కోసం ఆలోచిస్తూ చీప్ పబ్లిసిటీకి ముఫ్తీ ప్రయత్నిస్తున్నారని ఒమర్ విమర్శించారు. ఊలర్ సరస్సుపై గతంలో తలపెట్టిన తుల్ బుల్ నేవిగేషన్ ప్రాజెక్టును పునరుద్ధరించే ఆలోచనలో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం ఉంది. అయితే, ఒమర్ అబ్దుల్లా అభిప్రాయంతో జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ విభేదించారు. ఉత్తర కశ్మీర్‌లో ఊలర్ సరస్సు ఉంది. వీడియోలో చూస్తున్న సివిల్ వర్క్‌లు తుల్ బుల్ నావిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించినవి. ఈ పనులు 1980 లో మొదలయ్యాయి. సింధూ జలాల ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ పాకిస్థాన్ తెచ్చిన ఒత్తిడితో దాన్ని నిలిపివేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నావిగేషన్ కోసం జీలం నది ఉపయోగించు కునేందుకు మార్గం సుగమం అవుతుంది. దిగువన ఉన్న విద్యుత్ ప్రాజెక్టుల్లో విద్యుదుత్పత్తి మెరుగుపడుతుంది అని ఒక ట్వీట్‌లో ఒమర్ తెలిపారు. కాగా, ఒమర్ అబ్దుల్లా అభిప్రాయాన్ని మెహబూబా ముఫ్తీ తప్పుపట్టారు. భారత్-పాక్ మధ్య ఉద్రిత్తల నేపథ్యంలో తుల్ బుల్ నావిగేషన్ ప్రాజెక్టును పునరుద్ధరిస్తామంటూ సీఎం చెప్పడం దురదృష్టకరం. జమ్మూ కశ్మీర్‌లో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయి తీవ్ర నష్టంలో ఉన్న పరిస్థితిలో సీఎం వ్యాఖ్యలు ప్రమాదకరంగా, ఉద్రిక్తతలు రెచ్చగొట్టేలా ఉన్నాయి. అత్యంత అవసరమైన, జీవనాధారమైన నీటిని ఆయుధంగా మార్చడం అమానవీయం. ద్వైపాక్షిక అంశాలను అంతర్జాతీయంగా మార్చే ప్రమాదం కూడా ఉంది అని ముఫ్తీ ట్వీట్ చేశారు. పీడీపీ చీఫ్ ట్వీట్ పై ఒమర్ తిరిగి స్పందించారు. సింధూ జలాల ఒప్పందం (ఐడబ్ల్యూటీని)తో జమ్మూ కశ్మీర్‌కు చారిత్రక ద్రోహం జరిగింది. ఇది జమ్మూ కశ్మీర్ ప్రజల ప్రయోజనాలకు విరుద్ధం. ఈ ఒప్పందాన్ని నేను మొదట్నించీ వ్యతిరేకిస్తున్నా. ఇక ముందూ ఇదే వైఖరి కొనసాగిస్తాం. అయితే, దీన్ని ఒప్పుకునేందుకు మీరు (మెహబూబా) సిద్ధంగా లేరు. సరిహద్దుకు ఆవల ఉన్నవారి ప్రయోజనాల కోసం చౌకబారు పబ్లిసిటీ ప్రయత్నంలో ఉన్నారు. ఇది చాలా దురదృష్టకరం అని ఒమర్ రీట్వీట్ చేశారు. మరోవైపు, ఒమర్ వ్యాఖ్యలపై మెహబూబా వెంటనే స్పందించారు. ఎవరిని ఎవరు బుజ్జగించే పని చేస్తున్నారో కాలమే చెబుతుందన్నారు. తాము అంకితభావంతో ఉన్నామని, ఇది నిరూపించుకోవడానికి ఉద్రిక్తతలు సృష్టించాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని తెలిపారు.

# ఎస్కార్ట్ విధుల్లో అప్రమత్తత అత్యవసరం : జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



**విశాఖపట్నం, మే 16 (పెన్ సత్తా):** ఆర్మ్డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్, కైలా సగిరి మైదానంలో శుక్రవారం జరిగిన స్టాఫ్ పరేడ్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరేడ్ కమాండర్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ మన్మథరావు నేతృత్వంలో ఏ.ఆర్ డిఎస్పీ పి.నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఎస్పీకి గౌరవ వందనం అర్పించారు. అనంతరం పరేడ్‌ను సమీక్షించి, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎస్కార్ట్ విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బంది అత్యధిక అప్రమత్తతతో వ్యవహరించాలి అని హితవు పలికారు. నిందితులను కోర్టు నుండి జైలుకు, జైలు నుండి కోర్టుకు తరలించే సందర్భాలలో అత్యుత్తమ భద్రతా ప్రమాణాలను పాటించాలని, వారు ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకునే అవకాశమే లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తీవ్ర నేరాలకు పాల్పడిన నిందితుల విషయంలో వారి నేర చరిత్రను దృష్టిలో ఉంచుకుని మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి అని స్పష్టం చేశారు. గతంలో చోటు చేసుకున్న సంఘటనలను గుర్తుచేస్తూ, భవిష్యత్తులో అలాంటి తప్పులకు అవకాశం లేకుండా క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమ అనంతరం సిబ్బంది సంక్షేమంపై దృష్టి సారించిన ఎస్పీ, వారి ఆరోగ్యం, ఉద్యోగ సంబంధిత అంశాలు, వ్యక్తిగత వినతులపై సానుకూలంగా స్పందించారు. వాటిని పరిశీలించి, తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఏ.ఆర్ డిఎస్పీ పి.నాగేశ్వరరావులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఏ.ఆర్ డిఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏవో ఏ.రామ్ కుమార్, ఎస్‌బి ఇన్స్పెక్టర్ బాల సూర్యారావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రామకృష్ణా రావు, మన్మథరావు, రమణమూర్తి, అరవింద్ కిషోర్, సంజీవరావు, ఆర్ఎస్ఐ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కాలువల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి : కొణతాల



**అనకాపల్లి, మే 16 (పెన్ సత్తా):** అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఇరిగేషన్ అధికారులు నీటి సంఘాల ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు పాలకవర్గం సభ్యులు జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ అధికారులు తో కలిసి గుండాల జంక్షన్ వద్ద ఉన్న శంకరం సమావేశ మందిరంలో సమావేశం జరిగినది. ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ నీటి సంఘాల ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్, డైరెక్టర్లు రైతులతో కలిసి ఈ నిధులను పనులు ప్రారంభించాలని అన్నారు. మన ప్రాంతంలో ఉన్న ఇరిగేషన్ కాలువలకు, గ్రోయిన్స్ కు నిధులు కేటాయించకపోవడం నిర్లక్ష్యం వహించడం వలన మన ప్రాంతంలో రైతులకు ఎంతో అవసరమైన కాలువలు పూడికి పోయి అక్రమలకు గురయ్యాయని ఇప్పుడు వాటిని రీ సర్వే చేసి కాలువలో సాగునీరు పారే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అనకాపల్లి మండలం, కశింకోట మండలంలలో వున్న ఓ & ఎం పనులు కింద డిసిల్టింగుకి, నీటి సంఘాల ద్వారా కాలువలు చెరువులు అభివృద్ధికి నిధులు, కసింకోట కాశీ మధుం ఛానల్‌కి తొమ్మిది లక్షలు, పేరంటాల పాలెం ఛానల్‌కి ఆరు లక్షలు, సీతానగరం ఛానల్ కి 10 లక్షలు, తగరంపూడి ఛానల్‌కి 10 లక్షలు, వెదురుపర్తి ఛానల్‌కు ఆరు లక్షలు, తుమ్మపాల ఛానల్‌కి 10 లక్షలు, మాకవరం ఎర్రి నాయుడు ఛానల్‌కి 10 లక్షలు, సంతపాలెం వీరన్న ట్యాంకుకు 10 లక్షలు, సిహెచ్ఎన్ అగ్రహారం ధర్మసాగరం ట్యాంకుకు 10 లక్షలు, బట్లపూడి ఎరకన్న దొర ట్యాంక్‌కు 10 లక్షలు, రేబాక పూర ట్యాంకుకి తొమ్మిది లక్షలు, మొత్తం కోటి రూపాయలు నిధులు మంజూరయ్యాయి, అని అన్నారు. అదే విధంగా అనకాపల్లి పట్నం జీవీఎంసీ పరిధిలో ఉన్న 11 మురుగునీరు కాలవులలో డి సిల్టింగ్ చేయటనికి 50,25000 రూపాయలు నిధులు మంజూరు అయ్యయి అనీ అన్నారు. అదేవిధంగా పులి కాలవ 28 లక్షలు, వెదుళ్ల గడ్డ అగ్రహారం 29 లక్షల ముప్పది వేలు, పొతు కొండ గెడ్డ కొండుపాలెం గ్రామంకు 18 లక్షల 20 వేలు, కొప్పాక గ్రామం గైరమ్మ గెడ్డకి 6 లక్షలు, దిబ్బపాలెం గ్రామం చెర్లోపల ఛానల్ కు 9.95 లక్షలు, అనకాపల్లి టౌన్ చెర్లోపల ఛానల్‌కు 9.90 లక్షలు, తుమ్మపాల గ్రామమం ఎల్లయ్య ఛానల్‌కు 9.95 లక్షలు, అనకాపల్లి టౌన్ ఎల్లయ్య ఛానల్‌కు 10 లక్షలు, మొత్తం కోటి ముప్పై ఏడు లక్షలు నిధులు మంజూరు అయ్యాయి అనీ అన్నారు. తక్షణమే వీటికి పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖ పరిధిలో చేపట్టిన పనులు ఈ నెల ఆఖరు లోపల పనులు పూర్తి చేయాలని అన్నారు అదే విదంగా జిల్లా కలెక్టర్‌ని ఆవకాండం, నీటిపారుదల కాలువలు లో అక్రమణాలను తొలగించాలని కలెక్టర్ గారికి చెప్పడం అయింది అని అన్నారు కాలవలు పూర్తిగా రీ సర్వే చేయాలని అధికారులు ఆదేశించారు కాలువలు నీటి వనరులు అక్రమ గురైతే రాబోయే రోజుల్లో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటామని అన్నారు.

# బురద నీరు రాకుండా చర్యలు తీసుకున్న పంచాయతీ అధికారులు



**చోడవరం, మే 16 (పెన్ సత్తా):** స్థానిక గునిశెట్టి వారి వీధిలో పంచాయతీ కుళాయిలు ద్వారా బురద నీరు వస్తుండడంతో పంచాయతీ అధికారులు సమస్యను పరిష్కరించారు. ఎంపీడీవో పి.వి.ఎన్.జె ఆంజనేయులు ఆదేశాలు మేరకు చోడవరం సచివాలయం ఈవో కె.వి.ఎ.ఎస్ నారాయణరావు తమ సిబ్బందితో దగ్గరుండి పనులు చేయించారు. స్థానిక ఎడ్లవీధి వాటర్ ట్యాంక్ వద్ద వాల్ పోవడంతో దానిని మార్చి నీరు లీకేజీ లేకుండా సరి చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించినందుకు పంచాయతీ అధికారులను పలువురు కొనియాడారు.

# మొబైల్ మెడికల్ యూనిట్ వాహనాలను ప్రారంభించిన పెమ్మసాని

**గుంటూరు, మే 16 (పెన్ సత్తా):** గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో గెయిల్ ఇండియా లిమిటెడ్ సంస్థ సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటుచేసిన రెండు మొబైల్ మెడికల్ యూనిట్ వాహనాలను స్థానిక ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్‌తో కలిసి పెమ్మసాని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెమ్మసాని మాట్లాడుతూ గుంటూరు నగరంలో గాని పార్లమెంటు పరిధిలో గాని ఎక్కడెక్కడ ఏ ఏ సమస్యలు ఉన్నాయనేది మా టీం సమాచార సేకరణ నిమిత్తం పనిచేశారన్నారు. ఒక్కో వ్యాన్ నిర్వహణకు ఏడాదికి రూ. 35 లక్షల చొప్పున 2 వాహనాలకు కలిపి రూ. 70 లక్షలను గెయిల్ సంస్థ ఖర్చు చేస్తుంది. ఈ వ్యానులో ఒక ఎంబిబిఎస్ డాక్టర్, నర్స్, హెల్పర్, డ్రైవర్ వైద్యం నిమిత్తం నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారు. అందులో ప్రాథమిక పరీక్షలు చేసి, 100 రకాల ఉచిత మందులు కూడా అందిస్తారు. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ వ్యాన్ ఆయా గ్రామాల్లో, మార్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటుంది. బీద, బడుగు వర్గాలు నివసించే ప్రాంతాల్లో ముఖ్యంగా ఈ వాహనాలు తిరుగుతూ, ప్రజలకు నిత్యం వైద్య సదుపాయాలకు అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా పనిచేస్తాయి. వన్ ఇయర్ పైలట్ ప్రోగ్రాం కింద ఈ వాహనాలు ముందుగా పనిచేస్తాయి. అందరూ పూర్తిగా వినియోగించగలిగితే మరో సంవత్సరం పొడిగిస్తాము. అలాగే గుంటూరు పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ వాహనాలు తిరిగేలా కృషి చేస్తాం. త్వరలో ఈ రెండు వాహనాల కాకుండా అదనంగా మరిన్ని వాహనాలను తీసుకువచ్చే విధంగా కృషి చేస్తాం అన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు పూర్తిగా ఉపయోగించుకుంటారని మనస్పూర్తిగా ఆశిస్తూ, మాకు సహకరించిన గెయిల్ సంస్థ నిర్వాహకులకు మా ధన్యవాదాలన్నారు. ఈ కార్యక్రమంలో గెయిల్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనూప్ గుప్తా, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, జిఎంసి కమిషనర్ పులి శ్రీనివాసులు, టిడిపి సీనియర్ నాయకులు తాళ్ల వెంకటేష్ యాదవ్, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ నాయకులు గాదె వెంకటేశ్వర రావు, జీజీహెచ్ సూపరిండెంట్ రమణ, స్థానిక కార్పొరేటర్ ఎల్లావుల అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా పల్లా అర్జున జన్మదిన వేడుకలు



**చోడవరం, మే 16 (పెన్ సత్తా):** మండలంలోని గంధవరం మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు పల్లా అర్జున జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చేత కేకు కట్ చేయించి ఘనంగా నిర్వహించగా ఈ కార్యక్రమంలో పల్లా అప్పారావు, దేవర రవికుమార్, టి అప్పలనాయుడు, మొల్లి నానాజీ, పలువురు యువకులు పాల్గొన్నారు.

# మాతా,శిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలి జిల్లా కలెక్టరు


## - ప్రతి మరణానికి సంబంధించిన నివేదికను అందించాలి - ప్రజల నమ్మకం పొందేలా ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలందించాలి




**అనకాపల్లి, మే 16 (పెన్ సత్తా):** జిల్లాలో మాతా, శిశు మరణాలు సంభవించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజాసర్వే, మాతా, శిశు మరణాలు, వ్యాధి నిరోధక టీకాలు, మలేరియా, డెంగ్యూ తదితర అంశాలపై వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ తదుపరి సమీక్షా సమావేశానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు. నూతన దంపతులు, గర్భిణీ స్త్రీలు, శిశువుల రిజిస్ట్రేషను సక్రమంగా నమోదుచేయాలని తెలిపారు. హైరిస్క్ కేసులు, బరువు తక్కువ గల పిండాల కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి పౌష్టికాహారం సక్రమంగా అందించాలని, హైరిస్కు గల కేసులను ముందుగానే ఆసుపత్రులకు తరలించి మాతాశిశు మరణాలను కంట్రోల్ చేయాలని తెలిపారు. అబార్షన్లు అధికంగా చేస్తున్న ఆసుపత్రులపై నిఘా పెట్టాలని, అబార్షన్లుకు గల కారణాలపై నివేదిక అందించాలని తెలిపారు. శిశువులకు వాక్సినేషను సకాలంలో అందించాలని సంబంధిత వివరాలను రికార్డులలో సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. గత సంవత్సరం 19781 జననాలకు గాను 133 మంది శిశువులు, 1 నుండి 5 సంవత్సరాల పిల్లలు 16 మంది మరణించారని, 15 మాతృమరణాలు సంభవించాయని, ఇకముందు మరణం సంబంవించిన ప్రతికేసుకు సంబంధించిన నివేదికలను కేసులు వారీగా వెంటనే అందజేయాలని జిల్లా కలెక్టరు అధికారులను ఆదేశించారు. గ్రామాలలో ఆశ, ఎ.ఎన్.ఎం. వర్కర్లు క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కువగా సిజేరియన్ నిర్వహిస్తున్న ఆసుపత్రుల వివరాలు తీసుకోవాలని తెలిపారు. మలేరియా, డెంగ్యూ కేసుల నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, కేసులు నమోదెట్కన సచివాలయాల పరిధిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషను నిదులను ఆసుపత్రులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు. 104 వాహనాల ద్వారా అందిస్తున్న సేవలన్నీ ప్రజలకు సక్రమంగా అందేలా వైద్యాధికారులు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వైద్యాధికారిణి ఎం.శాంతిప్రభ, డిప్యూటీ డిఎంహెచ్ ఓ డా.వీరమణ, డిఐఒ డా.చంద్రశేఖర్ దేవ్, డి.పి.ఎం.ఒ. డా.ప్రశాంతి, మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

# చైనీస్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ బ్రహ్మోస్‌ని తట్టుకోలేక పోయింది

## - ఆపరేషన్ సిందూర్‌తో భారత్ ఒకే దెబ్బకు రెండు పిట్టల ఫలితాన్ని పొందినట్లు చెబుతున్నారు నిపుణులు



**ఇంటర్నెట్ డెస్క్:** ఆపరేషన్ సిందూర్‌తో భారత్ ఒకే దెబ్బకు రెండు పిట్టల ఫలితాన్ని పొందినట్లు చెబుతున్నారు నిపుణులు. ఇందులో భాగంగా ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌లో 100 మందికి పైగా ఉగ్రమూకలను మట్టుబెట్టి, వారి స్థావరాలను నేలమట్టం చేసి, పాక్ సైన్యాన్ని వణికించేసి, ఆ దేశ ప్రధాని సేఫ్ హౌస్‌కు పారిపోయే స్థాయిలో దెబ్బకొట్టింది, మరోవైపు చైనా ఆయుధాల పరువు తీసిందని చెబుతున్నారు. అవును ఆపరేషన్ సిందూర్ తో పాకిస్థాన్ పై భారత్ పూర్తిగా ఆధిపత్యం ప్రదర్శించిన సంగతి తెలిసిందే. పాక్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను భారత గగనతల రక్షణ వ్యవస్థ గాల్లో నిర్వీర్యం చేసింది. దీంతో పాక్ ఉపయోగించిన ఆయుధాల్లో సుమారు 80% చైనా తయారుచేసిన ఆయుధాలే కావడంతో ఇప్పుడు ప్రపంచ మార్కెట్ లో ఆ దేశ ఆయుధాలకు డిమాండ్ తగ్గాయని అంటున్నారు. ఈ విషయం పై ప్రపంచ వ్యాప్తంగా చర్చ మొదలైందని చెబుతున్నారు. అది చాలదన్నట్లుగా తాజాగా అమెరికా యుద్ధరంగ నిపుణుడు కల్నల్ (రిటైర్డ్) జాన్ స్పెన్సర్ చైనా ఆయుధాలను భారత ఆయుధాలతో కంపేర్ చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధానంగా బ్రహ్మోస్ క్షిపణి ప్రస్తావన తెచ్చారు, ఇందులో భాగంగా భారత్ దాడి, రక్షణాత్మక విషయాల్లో ఆదిపత్యం ప్రదర్శించిందని అన్నారు. ఇదే సమయంలో పాకిస్థాన్ లోని ఏ ప్రదేశాన్ని అయినా భారత్ ఎప్పు డైనా, ఎక్క డైనా ఢీ కొనగలమనే సందేశాన్ని ఆపరేషన్ సిందూర్ ఇచ్చిందని చెప్పారు. ఇదే సమయంలో పాకిస్థాన్ ఉపయోగించిన చైనీస్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ భారత్ బ్రహ్మోస్ క్షిపణులను తట్టు కోలేకపోయిందని తెలిపారు. మరోవైపు పాక్ డ్రోన్ దాడులు, క్షిపణులను భారత్ సక్సెస్ ఫుల్‌గా ఎదుర్కొందని స్పెన్సర్ వివరించారు. కాగా మోడరన్ వార్ ఇనిస్టిట్యూట్ అర్బన్ వార్ ఫేర్ స్టడీస్ అధిపతిగా పనిచేస్తున్న స్పెన్సర్ పాకిస్థాన్ ఉపయోగించిన చైనీస్ వైమానిక రక్షణ వ్యవస్థను బ్రహ్మోస్ విజయవంతంగా ఛేధించిందని, ఇది భారత అధునాతన సైనిక సామర్థ్యాలకు తాజాగా నిదర్శనమని వెల్లడించారు. దీంతో చైనా ఆయుధాల పరువు అమెరికా అధికారి అధికారికంగా తీసేశారనే కామెంట్లు వినిపిస్తున్నాయి.

# కాలువ పనులు త్వరగా ప్రారంభించాలి : పెమ్మసాని

## - విస్తరణ, భూ సేకరణకు నిధులు విడుదల చేసిన ప్రభుత్వం





**గుంటూరు, మే 16 (పెన్ సత్తా):** గుంటూరు ఛానల్ విస్తరణ పనులను త్వరగా ప్రారంభించాలి అని, అలాగే భూ సేకరణ సర్వే పనులు త్వరితగతన ప్రారంభించాలి అని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం జల వనరుల శాఖ అధికారులతో పెమ్మసాని సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఛానల్ అభివృద్ధి పనులలో భాగంగా ప్రభుత్వం విడుదల చేసిన నిధులకు తగ్గట్టుగా పనులు ప్రారంభించాలని సూచిస్తూ పెమ్మసాని తన క్యాంప్ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేక సమావేశమయ్యారు. గుంటూరు, పల్నాడు ప్రాంతాలకు ఉపయోగపడేలా గుంటూరు ఛానల్ విస్తరణ అభివృద్ధి పనుల నిమిత్తం కేంద్రమంత్రి పెమ్మసాని చొరవతో 2025-26 బడ్జెట్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విస్తరణ, భూసేకరణకు కలిపి రూ. 400 కోట్లను నిధులను మంజూరు చేసింది. అందులో భాగంగా భూ సేకరణకు రూ. 75 కోట్లను, విస్తరణకు రూ. 96 కోట్లను నాలుగు విడతలుగా విడుదల చేస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం ప్రకటించింది. కాగా ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో త్వరితగతిన విస్తరణ భూసేకరణ పనులను త్వరగా ప్రారంభించాలని పెమ్మసాని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే భూసేకరణలో భాగంగా నాలుగు గ్రామాల్లో నిర్వహించాలని సర్వే పనులను కాంట్రాక్టు సంస్థ చేపట్టాలని అధికారులకు ఆయన తెలియజేశారు. ప్రభుత్వానికి అందించాల్సిన ప్రతిపాదనలు త్వరితగతిన పంపాలని, అభివృద్ధి పనులపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని అధికారులు పనిచేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ రాంబాబు, సూపర్ ఇండియన్ వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి

## - అవగాహనతోనే నివారణ సాధ్యం : ప్రాంతీయ మలేరియా అధికారి డాక్టర్ ఎం.శాంతి ప్రభ





**అనకాపల్లి, మే 16 (పెన్ సత్తా):** డెంగ్యూ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ్య మలేరియా అధికారి, ఇంచార్జి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎం.శాంతి ప్రభ పిలుపునిచ్చారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం పురస్కరించుకొని జోనల్ మలేరియా అధికారి, ఇంచార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ ఎం.శాంతి ప్రభ ఆధ్వర్యంలో శుక్రవారం డెంగ్యూపై అవగాహన ర్యాలీని స్తానిక జిల్లా మలేరియా ఆఫీసు నుండి, నాలుగు రోడ్ల కూడలి వరకు నిర్వహించారు. డెంగ్యూ అవగాహన కర పత్రాలను ప్రజలకు అందజేస్తూ డెంగ్యూ వ్యాధి పై అవగాహన కల్పించటం జరిగిందన్నారు. అనకాపల్లి పట్టణం ప్రధాన కూడలిలో మానవ హారంగా నిలిచి డెంగ్యూ నివారణపై అనేక నినాదాలు చేయడం జరిగిందన్నారు. జిల్లా మలేరియా అధికారి కె. వరహాలు దొర మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి మానవాళికి చాలా ప్రమాదకరమని చెబుతూ డెంగ్యూ నివారణకై అవగాహన కల్పించారు. 2025 సంత్సరం రాష్ట్ర ప్రభుత్వం నినాదం మూడు పద్ధతులను పాటించండి డెంగ్యూను జయించండి. పరిశీలించండి, శుభ్రం చేయండి, మూతలు పెట్టండి అనే నినాదంతో ప్రజల్లో డెంగ్యూ నివారణపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికార్లు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఎ.ఎన్.ఎం.లు, లేబ్ టెక్నీషియన్లు, ఆశ కార్యకర్తలు, వివిధ నర్సింగ్ కళాశాల విద్యార్థినిలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రధాని మోదీతో లోకేష్ భేటీ



**అమరావతి, మే 16 (పెన్ సత్తా):** రాష్ట కూటమిలో మూడు పార్టీలు కలిసి ఉంటూనే సొంతంగా బలం పెంచుకోవటం పైన ఫోకస్ చేస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తి కానుంది. ఈ సమయంలో పాలనా పార్టీ పరంగా నిర్ణయాల వేగం పెంచాలని సీఎం చంద్రబాబు డిసైడ్ అయ్యారు. ఇదే సమయంలో పార్టీ మహానాడుకు సిద్దం అవుతున్నారు. ఈ సమయంలోనే లోకేష్‌కు ప్రమోషన్ అంశం తెర మీదకు వచ్చింది. లోకేష్ ఢిల్లీకి వెళ్తున్నారు. ప్రధాని మోదీ తో సమావేశం కానున్నారు. దీంతో ఈ పరిణామాలు మరింత ఆసక్తిగా మారాయి. మంత్రి నారా లోకేష్ నేడు శనివారం ప్రధానితో భేటీ కోసం ఢిల్లీ వెళ్లనున్నారు. అనంతపురం జిల్లా పర్యటనలో ఉన్న లోకేష్‌కు ప్రధాని అప్పాయింట్ మెంట్ ఖరారైనట్లు సమాచారం రావటంతో వెంటనే హైదరాబాద్ చేరుకుంటున్నారు. రేపు కుటుంబ సభ్యులతో కలిసి ఢిల్లీ వెళ్లనున్నారు. ఏపీ పర్యటనకు వచ్చిన సమయంలో ప్రధాని మోదీ తనను కలవాల్సిందిగా లోకేష్‌కు సూచించారు. తాజాగా ఆపరేషన్ సింధూర్ తరువాత లోకేష్ అప్పాయింట్‌మెంట్ కోరారు. కాగా, రేపు ఈ మేరకు లోకేష్ కు అప్పాయింట్‌మెంట్ ఖరారైంది. ఈ పర్యటన సమయంలో ఆపరేషన్ సింధూర్ తరువాత ప్రజల మూడ్ ఎన్డీఏ పాలన, ఏపీలో ఏడాది కూటమి పాలన గురించి చర్చించే అవకాశం ఉంది. అదే విధంగా ఆపరేషన్ సింధూర్ పైన ప్రధానికి ఏపీ తరపున అభినందనలు తెలపనున్నారు. లోకేష్ కు పార్టీలో ప్రభుత్వంలో ప్రమోషన్ గురించి చర్చ జరుగుతోంది. కొద్ది నెలల క్రితం పవన్‌తో సమానంగా లోకేష్‌కు డిప్యూటీ సీఎం హోదా ఇవ్వాలని టీడీపీ నేతలు ఓపెన్‌గా చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చగా మారాయి. పవన్ అభిమానులు ఈ ప్రతిపాదన పైన ఘాటుగా స్పందిస్తూ పోస్టింగ్స్ పెట్టటంతో వివాదంగా మారింది. ఆ తరువాత ఈ వ్యవహారం పైన ఎవరూ మాట్లాడవద్దని టీడీపీ అధినాయకత్వం ఆదేశించటంతో వివాదం ముగిసింది. ఇక, ఈ నెల 27వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కడప జిల్లా కమలాపురం నియోజకవర్గ పరిధిలో టీడీపీ మహానాడు జరగనుంది. ఇందు కోసం భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమయంలోనే ప్రస్తుతం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న లోకేష్ కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలంటూ తీర్మానం ప్రతిపాదించ ఆమోదించే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం. లోకేష్ ఇప్పటికే ప్రభుత్వంలో దాదాపు నెంబర్ టూ స్థానంలో ఉన్నారు. ప్రభుత్వ నిర్ణయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీలోనూ సీట్ల ఖరారు మంత్రివర్గ కూర్పు ప్రస్తుతం నామినేటెడ్ పదవుల విషయంలోనూ లోకేష్ పాత్ర కీలకంగా మారిందని పార్టీ నేతలు చెబుతున్నారు. దీంతో పార్టీలో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి గురించి మహానాడు వేదికగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. పార్టీ పదవుల విషయంలోనూ ఎవరూ రెండు సార్లు కంటే ఎక్కువగా ఒకే పదవిలో కొనసాగకూడదనే లోకేష్ ప్రతిపాదనకు పార్టీ పొలిట్ బ్యూరో ఆమోద ముద్ర వేసింది. దీంతో, ఈ పరిణామాల నేపథ్యంలో ప్రధానితో భేటీ పార్టీ మహానాడులో లోకేష్ పదవి పైన జరిగే నిర్ణయాల పైన టీడీపీలో ఆసక్తికర చర్చ సాగుతోంది.

# మత్స్యకారులు విద్యలో ఉన్నత స్థాయికి ఎదగాలనే తపన భక్తానికే సాధ్యం : ఎమ్మెల్సీ బీదా రవి చంద్ర





10లో అత్యధిక మార్కులు సాధించిన వారికి శాలువాతో సత్కరించి గంగా సరస్వతి పురస్కార అవార్డును ఇస్తున్న ఎమ్మెల్సీ, బీదా, దాత భక్తాని తదితరులు

**విడవలూరు, మే 16 (పెన్ సత్తా):** ఎన్నో ఏళ్ల నుండి అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న మత్స్య కారులు జీవితాల్లో వెలుగును చూడాలనే తపనతోనే ఒకే వేదికపై ప్రతిభావంతులను చేర్చి గంగా సరస్వతి పురస్కార అవార్డులు ప్రోత్సాహక బహుమతులను అందించిన ఘనత మత్స్యకార నేత, దాత, భక్తాని శ్రీనివాసులుకే దక్కిందని ఎమ్మెల్సీ బీదా రవి చంద్ర అన్నారు. గురువారం రవీంద్ర ఠాగూర్ హాల్లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీదా మాట్లాడుతూ, తీర గ్రామాల్లోని 11 నియోజక వర్గంలోని 124 గ్రామాలయందు ఉమ్మడి జిల్లా మత్స్యకారులకు చెందిన 10వ తరగతిలో 500 మార్కులు సాధించిన 125 మందిని శాలువాతో సత్కరించి, గంగా సరస్వతి పురస్కార అవార్డులను ఒక గోడ గడియారంను 570 మార్కులు పైన సాధించిన వారికి పారితోషికాలను శ్రీలక్ష్మి గణపతి సీ ఫుడ్స్ అధినేత భక్తాని శ్రీనివాసులు దాత్రుత్వములో ఎమ్మెల్సీ బీదా, మాజీ ఆఫ్కాఫ్ చైర్మెన్ పోలిశెట్టి, కూటమి నాయకులు చేతులు మీదుగా అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులకు అందచేసారు. మన జాతి ఇబ్బంది పడకుండా చదువుకు కావలసిన వసతులను ప్రభుత్వం ద్వారా కల్పిస్తామని బీదా అన్నారు. ఆడపిల్లలు ఆగకుండా చదువులో రాణించాలని కోరారు. రామతీర్థం జడ్పీ స్కూల్ ఒక మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్సీ బీదా ఉద్ఘాటించారు. మత్స్యకారుల్లో నుండి వచ్చిన భక్తానిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు. భక్తాని స్వయంకృషితో పెద్దఎత్తున ఒకే వేదికపై ప్రోత్సాహక కార్యక్రమంను ఏర్పాటు చెయ్యడం హర్షనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు, ఆర్ శివాజీ, అధ్యాపకులు సుధాకర్, ప్రముఖ న్యాయవాది జయలక్ష్మి, మహిళా టీడీపీ నాయకురాలు కోమారి విజయమ్మ, ఫిష్ కాన్ ఏపీ డైరెక్టర్ ప్రళయ కావేరి వేణుగోపాల్, కూటమి నాయకులు, బీజేపీ నేత మాధవ్, కళాశాల అధినేత విజయరత్నం, ఆర్ గోవిందు, శేషయ్య, కోమారి వేణుగోపాల్, టీడీపీ నేతలు దొడ్డపనేని రాజా, జిల్లా నుండి నలుమూలల నుండి మత్స్యకార నేతలు తల్లితండ్రులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ బీదాను సత్కరించిన దాత భక్తాని శ్రీనివాసులు, మత్స్యకార నేతలు

# ఏటూరు హరిరెడ్డికి తగిన పదవి రావడం హర్షనీయం : మోర్ల శివ ప్రసాద్ గౌడ్

**విడవలూరు, మే 16 (పెన్ సత్తా):** విడవలూరు మండలంకు నూతనంగా టీడీపీ అధ్యక్షులుగా ఎన్నికైన ఏటూరు హరిరెడ్డికి తగిన పదవి రావడం హర్షనీయమని వావిల్ల గ్రామం టీడీపీ సీనియర్ నేత మోర్ల శివ ప్రసాద్ గౌడ్ అన్నారు. గురువారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటూరుతోనే టీడీపీ బలమైన శక్తిగా ఎదుగుతోందని ధీమాను వ్యక్తం చేసారు. ఆయనకు పదవి కల్పించిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి అభినందనలు తెలిపారు. అదేవిదంగా సహకరించిన టీడీపీ నాయకులకు తాను అభినందనలు చెప్పారు.

# గౌరీ పరమేశ్వరుల ఉంజల్ సేవ కార్యక్రమం



**అనకాపల్లి, మే 16 (పెన్ సత్తా):** గౌరీ పంచాయతన దేవస్థానం నందు గౌరీ పరమేశ్వరుల శుక్రవారం 204వ ఉంజల్ సేవ కార్యక్రమం ఘనంగా జరిగినది. ఈ కార్యక్రమమునకు దేవాలయ అర్చకులు అంపోలు గోపాల కృష్ణ శర్మ, పొందూరు సూర్య నారాయణ శాస్త్రి , వేదవిదులైన పండితులచే నిర్వహించబడినది. ఈ ఉంజల్ సేవలో పాల్గొన కొణతాల రామచందం చంద్రకళ, కొణతాల పవన్ కుమార్ మేఘన దంపతులు కుటుంబ సభ్యులు. అతిథులు గౌరీ గీత మహిళా మండలి, సత్తెమ్మ తల్లి దేవస్థానం మహిళా మండలి, గౌరీ పరమేశ్వరి అమృత వర్షిని పెంతకంశెట్టి సుజాత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ , ఆళ్ళ మహాలక్ష్మి నాయుడు, మళ్ల సురేష్, ఆళ్ల వెంకట సత్యప్రసాద్ మరియు పాలకవర్గ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం జరిగింది.

# మత్స్యకారులకే వన్నె తెచ్చిన ఆణిముత్యం భక్తానికి వెల్లువెత్తున అభినందనలు

**విడవలూరు, మే 16 (పెన్ సత్తా):** విడవలూరు మండలంలోని పొన్నపూడి లక్ష్మి పురంకు చెందిన మత్స్యకార నేత భక్తాని శ్రీనివాసులు చేపట్టిన ఉత్తమ పురస్కారంగా సరస్వతి అవార్డులు పంపిణీ కార్యక్రమంను రెండు జిల్లాల స్థాయిలో వందలాది మందికి ఆయన దాత్రుత్వములో అందించిన అవార్డులు, బహుకరణ చేసిన సేవలను పలువురు మత్స్యకార నేతలు కొనియాడారు. మత్స్యకారుల్లో ఒక ఆణిముత్యం ఒకరు ఉండరనే భరోసాను ఇవ్వకలిగిన దాత, నేతగా ముందుకు వచ్చారని లక్ష్మిపురంకు చెందిన మత్స్యకార అంధులు నరసయ్య అన్నారు. ఇలాంటి సేవాగుణము కలిగిన ఆయన సొంత నిధులతో మత్స్యకారుల బిడ్డల భవిష్యత్తు కొరకు ఒక నూతన ఒరవడితో కార్యాచరణ ప్రణాళిక చేపట్టి అందరి మత్స్యకారుల విద్యార్థిని విద్యార్థులకు ఆదర్శప్రాయుడని అన్నారు. ఇలాంటి గొప్ప ఆలోచన రావడం, గతములో కూడా అనేక గ్రామాల్లో సరస్వతి విగ్రహాలు ఏర్పాటు చేసిన ఘనత కూడా ఆయనకే దక్కిందని అన్నారు. భక్తానిలాంటి దాతలు ఉంటే మత్స్యకారుల పేద విద్యార్థులకు ఒక ధైర్యం భరోసా ఉంటుందని అన్నారు. ఎందరో ఉన్నారు మత్స్యకారులు ఉన్నత వ్యాపారాలలో అయిన భక్తాని ఈరోజు నెల్లూరులో నిర్వహించిన గంగా సరస్వతి పురస్కారాలు అవార్డు ప్రధానాలు కీలకమైన అంశం అని అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న మత్స్యకార నేతలందరూ భక్తానిని కొనియాడారు.



# ఆవుల పోలయ్య గోవిందమ్మ దంపతుల దాత్రుత్వంలో ఆర్ ఓ వాటర్ ప్లాంట్





**విడవలూరు, మే 16 (పెన్ సత్తా):** మత్స్యకార ప్రజలకు త్రాగునీటి దాహార్తిని అందించేందుకు పొన్నపూడి కొత్తూరు గ్రామంలో సుమారు 5 లక్షలు రూపాయలు వ్యయంతో ఆవుల పోలయ్య గోవిందమ్మ దంపతులు దాత్రుత్వములో ఏర్పాటు చెయ్యడం జరిగింది. కీర్తిశేషులు ఆవుల పోలయ్య, కామాక్షమ్మ జ్ఞాపకార్ధంగా ఈఆర్ఓ ప్లాంట్‌ను నిర్మించామని దాతలు అన్నారు. ఈ ప్లాంట్‌ను వావిల్ల మాజీ ఎంపీటీసీ ఏటూరు హరిరెడ్డి, డీసీ చైర్మెన్ పాశం శ్రీహరి రెడ్డి చేతులు మీదుగా ప్రారంభం చేసారు. ఈ కార్యక్రమం దాతలు కుమారులు ఆవుల రమేష్, ఆవుల సురేష్, ఆవుల రాము, కుమార్తె జయకృష్ణమ్మలు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంకు స్థానిక టీడీపీ నాయకులు, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన చైర్ పర్సన్ అవిశ్వాసం...! - నిర్ణయం ప్రకటించిన 25 మంది కౌన్సిలర్‌లు





**సామర్లకోట, మే 16 (పెన్ సత్తా):** సామర్లకోట మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్ పర్సన్ మార్పునకు నిర్ణయం షురూ అయ్యింది. చైర్ పర్సన్ మార్పులకు సంబంధించి స్థానిక కౌన్సిల్ సమావేశ మందిరంలో కాకినాడ ఆర్డిఓ ఎస్ మల్లిబాబు ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించగా మున్సిపల్ కమిషనర్ ఏ శ్రీవిద్య అధ్యక్షతన చైర్ పర్సన్‌పై అవిశ్వాస సమావేశం గురువారం నిర్వహించారు. దీనిలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ఇరువురుతో కలిపి 25 మంది వైసీపీ కౌన్సిలర్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ మార్పునకు సంబంధించి చేతులెత్తి ఆమోదం తెలపవలసిందిగా ప్రిసైడింగ్ అధికారి మల్లిబాబు కోరగా సమావేశంలో పాల్గొన్న 25 మంది సభ్యులు ఏకగ్రీవంగా వారి చేతులను ఎత్తి మార్పునకు అభిప్రాయాన్ని తెలియజేశారు.

**అవిశ్వాసం ఏకగ్రీవం అయింది :**

మున్సిపల్ చైర్‌పర్సన్ మార్పులకు సంబం ధించి అవిశ్వాస ఆమోదం ఏకగ్రీవం అయిందని ప్రిసైడింగ్ అధికారి, కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లిబాబు వెల్లడించారు. అవిశ్వాస సమావేశం అనంతరం ఆర్డీవో విలేకరులతో మాట్లాడుతూ సామర్లకోట మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణపై అవిశ్వాసం కోరుతూ జిల్లా కలెక్టర్‌ను కోరిన సందర్భంలో తనను ప్రిసైడింగ్ అధికారిగా తనను నియమిస్తూ ఈరోజు ప్రత్యేక సమావేశానికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. దానిలో భాగంగా నిర్వహించిన సమావేశంలో 25 మంది వైసీపీ కౌన్సిలర్ సభ్యులు హాజరు కాగా కోరం సరిపోయినందున అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టినట్టు చెప్పారు. దానిలో సమావేశానికి హాజరైన 25 మంది సభ్యులు వారి చేతులెత్తి చైర్ పర్సన్ మార్పునకు అనుకూలంగా వారి నిర్ణయాన్ని తెలిపారన్నారు. దానితో చైర్ పర్సన్ మార్పునకు నిర్ణయం ఖరారు చేసినట్టు చెప్పారు. అయితే చైర్ పర్సన్ పై అవిశ్వాస తీర్మానం నిర్వహించవద్దని చైర్ పర్సన్ అరుణ కృష్ణమూర్తి హైకోర్టులో పిటిషన్ వేసినందున అది పరిష్కార మైన పిదప తదుపరి నిర్ణయాన్ని ప్రకటించను న్నట్టు ఆయన చెప్పారు.

**ఏకపక్ష నిర్ణయాల వలనే అవిశ్వాసం కోరాము :**

సామర్లకోట మున్సిపాలిటీలో పట్టణ ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి ఎజెండా రూపొందించే విషయంలో చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కొంతకాలంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ కౌన్సిలర్లను నిర్లక్ష్యం చేస్తున్నందున ప్రజా సమస్యల పరిష్కారం జరగక తీర్మానానికి కోరినట్టు మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్ అందరు వైసీపీ కౌన్సిలర్ పక్షంగా ఆరోపించారు. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో గంగిరెడ్డి అరుణకు కేవలం మూడు నెలలు మాత్రమే చైర్ పర్సన్ హోదా కల్పించగా నాలుగేళ్ల పాటు తను చైర్ పర్సన్ పదవిలో కొనసాగిన కొన్ని నెలలుగా కౌన్సిలర్లను విస్మరిస్తూ సమావేశాలు నిర్వహిస్తున్నందున పార్టీ అధిష్టానానికి ఈ విషయాన్ని తెలియజేశామన్నారు. దానిపై చైర్ పర్సన్ అరుణను అధిష్టానం హెచ్చరిం చినా ఆమె తీరు మారని కారణంగా అవిశ్వాస సమావేశానికి పూనుకోక తప్పలేదు అన్నారు.

దీనిలో భాగంగానే చైర్ పర్సన్ అరుణను పార్టీ అధిష్టానం వైసిపి పార్టీ నుంచి సస్పెండ్ చేసిందన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే ఏ నాయకని పట్ల అయినా అధిష్టానం ఇదే రీతిలో స్పందిస్తుందని ఈ సందర్భంగా వైస్ చైర్మన్ తెలిపారు. ఇదిలా ఉండగా మున్సిపల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం నిర్వహిస్తున్న నేపథ్యంలో మున్సిపాలిటీ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురు కాకుండా ఉండే విధంగా పెద్దాపురం డిఎస్పి డి శ్రీహరి రాజు ఆధ్వర్యంలో స్థానిక సీఐ కృష్ణ భగవాన్ మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. అయితే ప్రత్యేక సమావేశానికి గంట సమయం ముందే మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి తన రాజీనామా పత్రాలు మున్సిపల్ కమిషనర్ ఏ శ్రీవిద్యకు అందజేసి వెళ్లడంతో ఈ విషయంలో ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రక్రియ పూర్తి కావడంతో అధికారులు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

# విద్యుత్ వినియోగదారుల సమస్యలకు న్యాయ వేదిక

**కరప, మే 16 (పెన్ సత్తా):** కాకినాడ జిల్లా కరప మండలంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంగణంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా వినియోగ దారుల గ్రీవెన్స్ రెడ్రెసల్ ఫోరం (సిజీఆర్ఎఫ్) సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వినియోగదారులు నేరుగా పాల్గొని తమ సమస్యలను తెలియజేశారు. కరప సెక్షన్ కార్యాలయంలో జరిగిన ఈ సదస్సులో సిజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ పాల్గొని వినియోగదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. కొత్త కనెక్షన్ల జారీ ఆలస్యాలు, మీటర్ మార్పులు, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, మీటర్ లోపాలు, రీ కనెక్షన్ సమస్యలు, బిల్లింగ్ లోపాలు తదితర అంశాలపై వచ్చిన ఫిర్యాదులను నమోదు చేసి, త్వరితగతిన పరిష్కరించనున్నట్టు తెలిపారు. భారత విద్యుత్ చట్టం-2003 ప్రకారం 2005లో స్థాపితమైన ఈ ఫోరం, విశాఖపట్నం కేంద్రంగా శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల వినియోగదారులకు సేవలందిస్తోంది. ప్రస్తుతం ఈ ఫోరానికి విశ్రాంత జిల్లా న్యాయమూర్తి డా.బి.సత్యనారాయణ





అధ్యక్షత వహించగా, ఎస్.సుబ్బారావు, ఎన్.మురళీకృష్ణలు సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విద్యుత్ సేవలలో లోపం, ఆలస్యం, నిర్లక్ష్యం వంటి సమస్యలు ఎదురైన వినియోగదారులు ముందు సంబంధిత విద్యుత్ కార్యాలయాన్ని సంప్రదించి, పరిష్కారం రాకపోతే 1912 టోల్ ఫ్రీ నంబర్‌లో ఫిర్యాదు చేయవచ్చు. అవసరమైతే సిజీఆర్ఎఫ్‌ను లిఖితపూర్వకంగా ఆశ్రయించవచ్చు. తెలుగు లేదా ఆంగ్ల భాషలో పోస్టు లేదా ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు పంపవచ్చు. ఎటువంటి ఫీజు లేకుండా, న్యాయవాది అవసరం లేకుండా 60 రోజుల్లో సమస్యలు పరిష్కరించబడతాయి. వినియోగదారుల అవగాహన కోసం సిజీఆర్ఎఫ్ ప్రతినిధులు గ్రామాలు, పట్టణాలు సందర్శిస్తూ తమ సేవల గురించి వివరించడమే కాకుండా, న్యాయపరంగా ఎలా సహాయం అందుతుందో అవగాహన కలిగిస్తున్నారు. ఇలా ఇప్పటివరకు 108కేసుల్లో అధికారులను బాధ్యులను చేస్తూ వారి నుంచి రూ.14,36,956లను వినియోగదారులకు పరిహారంగా చెల్లించామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్ సదుపాయం ఉందని, అలాగే వ్యవసాయానికి 9 గంటల వరకు ఉచిత విద్యుత్ సదుపాయం ఉందని పేర్కొంటూ వినియోగదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలపై సంబంధిత అధికారులు పట్టించుకోకపోతే సీజీఆర్ఎఫ్ను సంప్రదించి న్యాయం పొందాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలకు గురై మరణిం చిన, అంగవైకల్యం పొందినవారికి సంస్థ నుంచి పరిహారం అం దుతుందని, ఆ విషయంలో అధికార్డులు సకాలంలో స్పందించక పోతే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.కరప సబ్ స్టేషన్‌లో జరిగిన ఈ సమావేశంలో ఏడీఈ తుమ్మలపల్లి విష్ణుమూర్తి, ఏఈ ఈశ్వరరావు, సబ్ స్టేషన్ సిబ్బంది, వినియోగ దారులు తదితరులు పాల్గొన్నారు. కరప సబ్ స్టేషన్‌లో జరిగిన ఈ సమావేశంలో ఏడీఈ తుమ్మలపల్లి విష్ణుమూర్తి, ఏఈ ఈశ్వరరావు, సబ్ స్టేషన్ సిబ్బంది, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

# చైర్ పర్సన్ పదవికి అరుణ కృష్ణమూర్తి రాజీనామా



**సామర్లకోట, మే 16 (పెన్ సత్తా):** సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి తన చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశారు. గురువారం ఉదయం తొమ్మిది గంటలకు మున్సిపల్ కార్యాలయంలో తన రాజీనామా పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ ఏ శ్రీవిద్యకు అందజేశారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్ పర్సన్ సీటుకు పై భాగంలో ఉన్న దేశ నాయకుల చిత్రపటాలకు ఆమె గౌరవ వందనం చేశారు. అనంతరం నాలుగేళ్ల పాటు తనకు సేవలు అందించిన చైర్‌పర్సన్ కుర్చీకి పూలమాలలు వేసి గౌరవపూర్వకంగా తన రాజీనామాను వెల్లడించారు. గత కొన్ని నెలలుగా చైర్‌పర్సన్ మార్పుపై సొంత పార్టీ అయిన వైసీపీ కౌన్సిలర్లే పార్టీ అదిష్టానానికి ఫిర్యాదులు చెయ్యడం, గత రెండు నెలలుగా అవిశ్వాస తీర్మానానికి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని విన్నవించడం పట్టణ ప్రజలకు తెలిసిందే. ఈ క్రమంలో గురువారం అవిశ్వాస తీర్మానానికి ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్న తరుణంలో చైర్ పర్సన్ అరుణ సమావేశానికి ఒక గంట ముందుగా మున్సిపల్ కమిషనర్ ఏ శ్రీవిద్యను కలిసి తన రాజీనామా పత్రాన్ని అందించారు. ఈ సందర్బంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా చైర్ పర్సన్‌గా పనిచేసిన సమయంలో తనకు పూర్తి సహకారాన్ని అందించిన పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు, మున్సిపల్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, అందరు కౌన్సిలర్లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కేవలం మున్సిపాలిటీలో హేతుబద్ధమైన సేవలందించేం దుకే తాను పనిచేశానన్నారు. పట్టణ ప్రజలందరికీ న్యాయమైన సేవలు అందించాననే తృప్తి నాకు ఉందన్నారు. అయితే కౌన్సిలర్లు తనపై అవిశ్వాసాన్ని ప్రవేశపెడుతున్నారనే భయంతో కాదు కానీ విలువ చూపించని తోటి కౌన్సిలర్ల మధ్య పనిచేయడం ఇష్టం లేకనే తన సొంత నిర్ణయంతో చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ఆమె స్పష్టం చేశారు.

# ఘనంగా పెనుగుదురులో అపర భగీరథుడి జయంతి వేడుక




**కరప, మే 16 (పెన్ సత్తా):** ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజలకు ఆరాధ్య దైవంగా భావించే అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతిని అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ పద్మరామ్ ఆధ్వర్యంలో పెనుగుదురు బ్రిడ్జి వద్ద ఘనంగా నిర్వహిం చారు. ఈ వేడుకకు అధ్యక్షత వహించిన తెలగాని వీరభద్రరావు నేతృత్వంలో ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ డైరెక్టర్, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ "ఉభయ గోదావరి జిల్లాల అభివృద్ధికి ఆద్యుడైన సర్ కాటన్ సేవలు అపూర్వం. 18వ శతాబ్దంలోనే ధవళేశ్వరం, విజ్జేశ్వరం వద్ద నిర్మించిన ఆనకట్టల వల్లే ఈ ప్రాంతం సస్యశ్యామలమైంది. కృష్ణా నదిపై నిర్మించిన ఆనకట్టలో కూడా ఆయన పాత్ర ఎనలేనిది" అని తెలిపారు. "బ్రిటిష్ ఆర్మీలో సేవలందిస్తూ నీటిపారుదల ఇంజనీరుగా రైతుల జీవితాలలో వెలుగులు నింపిన కాటన్, 96 ఏళ్ల వయసులో 1899లో పరమపదించడంతో ఆయన సేవలు మరువలేనివి" అన్నారు. ఈ కార్యక్ర మంలో దక్షిణ భారత మల్టిపుల్ కౌన్సిల్ ట్రెజరర్ వనం శ్రీనివాసరావు, జిల్లా క్యాబినెట్ కోశాధికారి కిరణ్ కుమార్, జనసేన నాయకులు గంటా నాని తదితరులు పాల్గొన్నారు. అందరూ కలసి సర్ కాటన్‌కు జయప్రదం చేశారు.

# వీధి నాటకం ద్వారా హెచ్ఐవి/ ఎయిడ్ పై అవగాహన




**కాకినాడ, మే 16 (పెన్ సత్తా):** రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ తాడేపల్లి గుంటూరు జిల్లా ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫోర్ హెచ్ఐవి / ఎయిడ్స్ క్లస్టర్ కాకినాడ సంయుక్తంగా మే నెల 13వ తేదీ నుండి 29వ తేదీ వరకు కళా జాతర బృందాలతో వీధి నాటకాల ద్వారా హెచ్ఐవి/ ఎయిడ్స్ మరియు సుఖ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమ ములో భాగంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆర్. రమేష్ డి (ఎల్ ఎ టి ఓ) ఆదేశాలతో, కే వి ఆర్. శైలజ (సిపిఎం) మరియు చేంజెస్ కాకినాడ సంస్థ కే.పుష్పా కుమారి ఆధ్వర్యంలో గురువారం కాకినాడ అర్బన్, రేచర్ల పేట, రైతు బజారు ప్రాంగణంలో వీధి నాటకం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది. ఎలా వ్యాపించదు, సుఖ వ్యాధులు రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి. హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగ సమాజంలో కలిసి జీవించాలి. సుఖ వ్యాధులు మరియు క్షయ వ్యాధి సంబంధం గూర్చి వాటి చికిత్స గూర్చి కండోమ్ యొక్క ఉపయోగాలు గూర్చి ఆరోగ్య విషయాల పట్ల కళా జాతర ద్వారా అవగాహన కల్పించారు. ఈ కళా జాతర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు. అధికారులు కళాకారులని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి కౌన్సిలర్ ఏడిద కృష్ణ, వైద్య అధికారి శిరీష, ప్రసాద్, ఏఆర్టి కౌన్సిలర్, భారతి మణి ఐ.సి.టి. సి కౌన్సిలర్, పి దుర్గా భవాని చేంజెస్ ప్రాజెక్ట్ మేనేజర్, చేంజెస్ కాకినాడ, వార్డు ఏఎన్ఎంలు, చేంజెస్ కాకినాడ సంస్థ సిబ్బంది శివా, సునీత, నాగదుర్గ, సరోజ, నారాయుడు, గౌరి, గాయత్రి, సుశీల, చైతన్య కళాభారతి వెల్ఫేర్ అసోసియేషన్ కళాకారులు, ట్రూప్ ఆర్గనైజర్ వీర్నాల కృష్ణ బృంద సభ్యులు, దువ్వూరి శేషు కుమారి, గుబ్బల శ్రీనివాసరావు, ఎడవల్లి సత్యవర్మ, విప్ప గోవిందరాజు, ఎడవల్లి రమణబాబు పాల్గొని కళా జాతర బృందం ప్రదర్శన చేసి ఉన్నారు. ప్రేక్షకులు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాలలో పరిశుభ్రత కోసం ప్రత్యేక చర్యలు




**కరప, మే 16 (పెన్ సత్తా):** కరప మండలంలోని గ్రామాల పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని అరట్లకట్ట గ్రామంలో డిప్యూటీ ఎంపీడీవో సలాది శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని ఆయన సూచించారు. గ్రామాలలో ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్లపై లేదా డ్రైనేజీల్లో వేయకుండా ప్రత్యేకంగా భద్రపరచాలని, అలా చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని ఆయన తెలిపారు. చెత్తను శాస్త్రీయంగా వేరు చేయడం వల్ల పునర్వినియోగానికి అవకాశం ఉంటుందని వివరించారు. చెత్త నుండి సంపద కేంద్రాలను సందర్శించి అవగాహన కల్పించారు. చెత్తను సంపద కేంద్రాలకు తరలించి కంపోస్ట్ ఎరువులు తయారు చేసే విధానం గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ ఎరువులను నర్సరీలు, వ్యవసాయం తదితర అవసరాలకు ఉపయోగించవచ్చని సూచించారు. గ్రామాల పరిశుభ్రత కోసం ప్రజలందరి సహకారం అవసరమని, శుభ్రమైన గ్రామాల ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం కలుగుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# 'డాన్' డెన్‌లో కృతి ఎంట్రీ ఎప్పుడంటే..!



బాలీవుడ్ ప్రేక్షకులకు మాత్రమే కాకుండా అన్ని భాషల ప్రేక్షకులకు డాన్ సినిమా చాలా స్పెషల్ అనడంలో సందేహం లేదు. ఇప్పటి వరకు వచ్చిన డాన్ ఫ్రాంచైజీ సినిమాల్లో షారుఖ్ ఖాన్ నటించాడు. డాన్ ఫ్రాంచైజీ సినిమాలు సూపర్ హిట్ అయిన నేపథ్యంలో డాన్ 3 కోసం హిందీ ప్రేక్షకులు చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. డాన్ 2 వచ్చిన దాదాపు 15 ఏళ్ల తర్వాత డాన్ 3 సినిమా రాబోతుంది. డాన్ 3 సినిమాలో షారుఖ్ ఖాన్ కాకుండా బాలీవుడ్ మరో క్రేజీ హీరో రణ్వీర్ సింగ్ నటిస్తున్న విషయం తెల్సిందే. ఇప్పటికే సినిమాను పట్టాలెక్కించారనే వార్తలు వస్తున్నాయి. చిత్ర యూనిట్ సభ్యుల నుంచి అధికారికంగా ప్రకటన కోసం అభిమానులు వెయిట్ చేస్తున్నారు.ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రూపొందుతున్న డాన్ 3 సినిమాపై అంచనాలు ఇప్పటికే భారీగా పెరిగాయి. అంచనాలకు తగ్గట్లుగా సినిమాను రూపొందిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్, టెస్ట్ షూట్, ప్రీ విజువల్ ఎఫెక్ట్స్ వర్క్ నడుస్తున్నట్లు ఆ మధ్య చిత్ర యూనిట్ సభ్యుల్లో ఒకరు చెప్పుకొచ్చారు. సెప్టెంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ జరిగే అవకాశాలు ఉన్నాయని సమాచారం అందుతోంది. ఈ సినిమాలో రణ్వీర్ సింగ్‌కు జోడీగా ఆదిపురుష్ హీరోయిన్ కృతి సనన్ నటించబోతుంది. బాలీవుడ్‌లో ఈ మధ్య కాలంలో మోస్ట్ బిజీ హీరోయిన్‌గా వరుస సినిమాలు చేస్తున్న కృతి సనన్ డాన్ 3 సినిమాలో ఎంట్రీ ఇవ్వడం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ధనుష్ హీరోగా ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'తేరి ఇష్క్ మైన్' సినిమాలోనూ కృతి సనన్ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెల్సిందే. త్వరలోనే ధనుష్, ఆనంద్ ఎల్ రాయ్ సినిమా పూర్తి కానుంది. కృతి సనన్ ప్రస్తుతం ధనుష్ సినిమాపైనే దృష్టి పెట్టిందని, ఆ సినిమా పూర్తి అయిన తర్వాత డాన్ 3 సినిమా షూటింగ్‌లో జాయిన్ కాబోతున్నట్లు తెలుస్తోంది. డాన్ 3 సినిమా షూటింగ్ ప్రారంభం అయ్యే సమయంకు తేరి ఇష్క్ మైన్ సినిమా షూటింగ్ పూర్తి కావాలని కృతి సనన్ ఇప్పటికే నిర్మాతలతో చెప్పిందని సమాచారం అందుతోంది.

ధనుష్ సినిమాలో కృతి సనన్ పాత్ర ఏంటా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కృతి సనన్ గత ఏడాదిలో తేరీ బాతోన్ మే ఐసా ఉలా జియా, క్రూ, దో పట్టి సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా లతో బాలీవుడ్‌లో మరింత బిజీ అయింది. అయితే డాన్ 3 సినిమాకు ఉన్న ప్రాముఖ్యత నేపథ్యంలో వచ్చిన కొన్ని ఆఫర్లను కృతి సున్నితంగా తిరస్కరించిందని తెలుస్తోంది. డాన్ 3 సినిమా వచ్చే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు వస్తే, ఆ తర్వాత మరిన్ని సినిమాల్లో కృతి సనన్ నటించే అవకాశాలు ఉన్నాయి. నార్త్‌తో పాటు సౌత్ ఇండియాలోనూ వరుస సినిమాలు చేస్తూ, అక్కడ ఇక్కడ స్టార్ హీరోయిన్‌గా మంచి గుర్తింపు దక్కించుకుని దూసుకు పోతున్న కృతి సనన్ మళ్లీ తెలుగులో ఎప్పుడు కొత్త సినిమాకు కమిట్ అవుతుందో చూడాలి.


# మిషన్ ఇంపాజిబుల్ ది ఫైనల్ రికానింగ్ టాక్ ఏంటి..?




యాక్షన్ సినీ ప్రియులకు మిషన్ ఇంపాజిబుల్ సీరీస్‌లు చూడటం అంటే భలే ఇష్టపడతారు. హై యాక్షన్ స్టంట్స్, సాహస విన్యాసాలతో వెండితెర మీద అద్భుతాలు చేసింది మిషన్ ఇంపాజిబుల్. ఐతే ఆ సీరీస్‌ని కొనసాగిస్తూ వస్తున్నారు మేకర్స్. రెండేళ్ల క్రితమే మిషన్ ఇంపాజిబుల్ డెడ్ రికానింగ్ తీశారు. ఐతే అది పార్ట్ 1 కాగా దానికి కొనసాగింపుగా లేటెస్ట్‌గా మిషన్ ఇంపాజిబుల్ ది ఫైనల్ రికానింగ్ అనే సినిమా వచ్చింది. లేటెస్ట్‌గా రిలీజైన ఈ సినిమా ప్రేక్షకులను మెప్పించే ప్రయత్నం చేసింది. మామూలుగా అయితే మిషన్ ఇంపాజిబుల్ సీరీస్ ల మీద ఒక ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. వాటికి తగినట్టుగానే ఈ సీరీస్‌లు చేస్తూ వస్తున్నారు. ఐతే రెండేళ్ల క్రితం వచ్చిన మిషన్ ఇంపాజిబుల్ డెడ్ రికానింగ్ పార్ట్ 1 రాగా దానికి సీక్వెల్‌గానే మిషన్ ఇంపాజిబుల్ ది ఫైనల్ రికానింగ్ వచ్చింది. పార్ట్ 1 ని కొనసాగిస్తూ ఆ తర్వాత ఐఎంఎఫ్ ఏజెంట్ ఈథన్ హంట్ మిషన్ లో దిగడం తో ఈ సినిమా మొదలవుతుంది. ది ఏంటిటి అనే AI ప్రోగ్రాంని గాబ్రియేల్‌కి దక్కకుండా ఆపేందుకే ఈ పోరాటం జరుగుతుంది. ఐతే ఈ మిషన్‌లో అతను సక్సెస్ అయ్యాడా లేదా అన్నదే ఈ సినిమా కథ. 'మిషన్ ఇంపాజిబుల్' బెస్ట్ ఓపెనింగ్స్ మిషన్ ఇంపాజిబుల్ సీరీస్ అన్నిటిలో కూడా కథ మరీ అంత గొప్పగా ఏమి ఉండదు. ప్రపంచాన్ని రక్షించే ఏజెంట్ ఈథన్ అంట్ చేసే స్టంట్స్ తోనే వచ్చాయి. ఐతే ఈ సినిమాలో కూడా టామ్ క్రూజ్ అదిరిపోయే స్టంట్స్ చెశాడు. అతను ఉన్న 60 ప్లస్ ఏజ్‌లో ఇలా చేయడం అన్నది గొప్ప విషయం. ముఖ్యంగా ఎలాంటి డూప్స్, గ్రాఫిక్స్ లాంటివి లేకుండా టామ్ క్రూజ్ చేసిన ఈ విన్యాసాలు నెక్స్ట్ లెవెల్ అనిపిస్తాయి. మిషన్ ఇంపాజిబుల్ అంటేనే టామ్ క్రూజ్ అనేలా సీరీస్‌లు చేస్తూనే వచ్చాడు. ఈ సినిమాలో కూడా అతను మళ్లీ అబ్బురపరిచారు. టామ్ క్రూజ్ స్టంట్స్ కోసమే మిషన్ ఇంపాజిబుల్ సినిమాలు చూసే ఫ్యాన్స్ ఉన్నారు. ప్రాణాలు సైతం లెక్క చేయకుండా అతను చేసే విన్యాసాలు మైండ్ బ్లాక్ అయ్యేలా చేస్తాయి. ఈ సినిమాలో కూడా ఈథన్ హంట్‌గా అతను చూపించే తెగువ వేరే లెవెల్ అనిపిస్తుంది. కేవలం టామ్ క్రూజ్ నటన, స్టంట్స్ వల్లే సినిమా ఇంప్రెస్ చేసేలా ఉందనిపిస్తుంది. ఐతే అతనితో పాటు హేలీ అట్వెల్, వింగ్ రేమ్స్, సైమన్ పె, హెన్రీ జెర్నీ, ఏంజెలా బాసెట్ లాంటి వారు కూడా ఈ సినిమాలో తమ పాత్రలకు న్యాయం చేశారు. ఐతే ఈ సినిమాలో కథనం కాస్త స్లోగా ఉన్నట్టు అనిపిస్తుంది. అక్కడక్కడ బోర్ కొట్టినట్టుగా ఉంటుంది. ఇలాంటి యాక్షన్ అడ్వెంచర్ సినిమాల్లో స్క్రీన్ ప్లే ఎంత వేగంగా ఉంటే అంత బాగుంటుంది. కానీ అక్కడక్కడ స్క్రీ ప్లే ట్రాక్ తప్పుతుంది. ఇక ఈ సినిమా రెండు గంటల 49 నిమిషాల లెంగ్త్‌తో వచ్చింది. ఎడిటింగ్ విషయంలో ఇంకాస్త జాగ్రత్త తీసుకుంటే బాగుండేది. అయినా కూడా యాక్షన్ ప్రియులతో పాటు టామ్ క్రూజ్ స్టంట్స్ చూసి ఆనందపడే వారికి మిషన్ ఇంపాజిబుల్ ది ఫైనల్ రికానింగ్ నచ్చుతుంది.

# భళా.. బల్లెం వీరా

**- 90 మీటర్ల మార్క్‌తో నీరజ్ చరిత్ర - డైమండ్ లీగ్‌లో భారత స్టార్‌కు రెండోస్థానం - వెబర్‌కు మొదటి స్థానం**




దోహా: మన బల్లెం వీరుడు భళా అనిపించాడు.. మరోసారి అసాధారణ ప్రదర్శనతో దేశం ఉప్పొంగేలా చేశాడు. ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న తన 'లక్ష్యాన్ని' జావెలిన్ త్రో స్టార్ నీజర్ చోప్రా చేరుకున్నాడు. దోహాలో శుక్రవారం జరిగిన ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ టోర్నీలో నీరజ్.. మూడో ప్రయత్నంలో ఈటెను 90.23 మీటర్ల దూరం విసిరాడు. అయితే, హోరాహోరీగా సాగిన పోటీలో జర్మనీకి చెందిన జులియన్ వెబర్ టైటిల్ దక్కించుకున్నాడు. కాగా.. చాలాకాలంగా 90 మీటర్ల లక్ష్యానికి గురిపెట్టిన నీరజ్ ఏకంగా దానిని మించిన దూరంలో ఈటెను విసరడం విశేషం. తొలి ప్రయత్నంలోనే 88.44 మీటర్ల దూరం విసిరిన చోప్రా..ప్రధాన ప్రత్యర్థులు అండర్సన్ పీటర్స్, జులియన్ వెబర్‌లకు అందనంత దూరంలో నిలిచాడు. రెండో రౌండ్‌లో ఫౌల్ చేసిన భారత అథ్లెటిక్స్ పోస్టర్ బాయ్ నీరజ్ మూడో రౌండ్‌లో ఏకంగా 90.23 మీ.దూరంతో కెరీర్‌లో అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. ఇక..నీరజ్ గత అత్యుత్తమ దూరం 89.94 మీ. దీనిని 2022 స్టాక్‌హోమ్ డైమండ్ లీగ్‌లో నెలకొల్పాడు. అది జాతీయ రికార్డు కూడా కావడం విశేషం. కాగా..అంతకుముందు ఈ సీజన్ అత్యుత్తమ దూరాన్ని (84.52 మీ) నీరజ్ తొలి ప్రయత్నం (88.44 మీ.)లోనే అధిగమించాడు. నాలుగో ప్రయత్నంలో 80.56 మీ. దూరం విసిరిన 27 ఏళ్ల చోప్రా, ఐదో ప్రయత్నంలో ఫౌల్ చేశాడు. ఆరో, ఆఖరి ప్రయత్నంలో 88.20 మీ. దూరంతో సరిపెట్టుకున్నాడు. విజేత వెబర్: నీరజ్‌కు దోహా అంచె టైటిల్ ఖాయమని అనుకున్న దశలో..జర్మనీకి చెందిన జులియన్ వెబర్ అనూహ్యంగా దూసుకొచ్చాడు. ఐదో రౌండ్‌లో 89.84 మీ. దూరం విసిరి చోప్రాకు సమీపంలోకి వచ్చిన వెబర్..ఆరో రౌండ్‌లో 91.06 మీ. దూరం ఈటెను విసిరి టైటిల్ సొంతం చేసుకున్నాడు. ఈ దూరం వెబర్‌కు వ్యక్తిగత అత్యుత్తమం కూడా. అండర్సన్ పీటర్స్ (గ్రెనడా– 85.64 మీ.)కు మూడోస్థానం దక్కింది. ఈ విభాగంలో పోటీపడిన మరో భారత అథ్లెట్ శ్రీకాంత్ జెనా ఎనిమిది స్థానంతో నిరాశపరిచాడు. పారుల్..జాతీయ రికార్డ్: మహిళల మూడు వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో భారత్‌కు చెందిన పారుల్ చౌధురి 9ని13.39 సె. గమ్యం చేరి కొత్త జాతీయ రికార్డు నెలకొల్పింది. అయితే ఈ విభాగంలో ఆమె ఓవరాల్‌గా ఆరో స్థానంలో నిలిచింది.

# కరుణ్‌కు పిలుపు

**- శార్దూల్‌కు కూడా..ఇంగ్లండ్ 'ఎ'తో పోరుకు భారత్ 'ఎ' జట్టు**





**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్‌లో పర్యటించే భారత్ 'ఎ' జట్టుకు అభిమన్యు ఈశ్వరన్ నేతృత్వం వహించనున్నాడు. 18 మందితో కూడిన జట్టును సెలెక్టర్లు శుక్రవారం ప్రకటించారు. రంజీల్లో అద్భుత ప్రదర్శన కనబర్చిన కరుణ్ నాయర్‌కు చోటు కల్పించారు. ఇంగ్లండ్ 'ఎ'తో ఈనెల 30 నుంచి జరిగే రెండు ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో అతను మెరుగైన ప్రదర్శన కనబరిస్తే తిరిగి జాతీయ జట్టులో చోటు దక్కొచ్చు. కరుణ్‌తో పాటు పేసర్ శార్దూల్ ఠాకూర్‌ను జట్టులో చేర్చారు. వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా.. ఇషాన్ కిషన్ రెండో కీపర్‌గా ఉంటాడు. ఇక ఐపీఎల్‌లో సన్‌రైజర్స్, రాజస్థాన్ జట్లు ప్లేఆఫ్స్ రేసు నుంచి తప్పుకోవడంతో నితీశ్ కుమార్, ఇషాన్, జైస్వాల్‌ను ఎంపిక చేశారు. చెన్నై కెప్టెన్ రుతురాజ్ ఈ టూర్‌కు అందుబాటులో ఉండనున్నాడు. గిల్, సాయి సుదర్శన్ మాత్రం జూన్ 6 నుంచి జరిగే రెండో మ్యాచ్‌కు అందుబాటులో ఉంటారు. అలాగే భారత్ 'ఎ' జూన్ 13 నుంచి నాలుగు రోజుల మ్యాచ్‌లోనూ తలపడనుంది. భారత్ 'ఎ' జట్టు: అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), జైస్వాల్, రుతురాజ్, కరుణ్, జురెల్, నితీశ్ కుమార్, శార్దూల్, ఇషాన్, సర్ఫరాజ్, ముకేశ్, తుషార్, ఆకాశ్ దీప్, హర్షిత్ రాణా, కాంబోజ్,ఖలీల్, తుషార్, హర్ష్ దూబే, సుతార్, గిల్, సుదర్శన్ (వీరిద్దరూ రెండో మ్యాచ్‌కు).

"PEN SATTA" Telugu Daily Printed, Published & Owned by : **CHINTAMANENI ANIL KUMAR,** D.No.1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRA PRADESH-531021, Published at D.No.1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRA PRADESH-531021. and Printed at Chaitanya Varadhi Printers, D.No. 2-99, Bharanikam, Parawada, VISAKHAPATNAM-531021, Editor : **CHINTAMANENI ANIL KUMAR,** D.No.1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRA PRADESH-531021, Cell : 98853 15759, RNI No.APTEL/2023/87729, Email : anilchintamaneni@gmail.com